Visakha
Samacharam
MINI
FUNCTION HALL
100 Seating
Call : 93939 49345

VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM
Postal Registration No. VSP / 96/ 2024 - 26.
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్




RNI No.52722/90 సంపుటి : 34 సంచిక : 236 విశాఖపట్నం, 04 జూలై 2024 గురువారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00

## తమ విజయాన్ని చూసి కాంగ్రెస్ ఓర్వలేక పోతోంది: మోదీ



రాజ్యసభలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. 3వసారి ఎన్డీఏ ప్రభుత్వాన్ని ఎన్నుకుని.. ప్రజలు గొప్ప నిర్ణయం తీసుకున్నారంటూ మోదీ పేర్కొన్నారు. ప్రజల నిర్ణయాన్ని తక్కువచేసి చూపే ప్రయత్నం చేస్తున్నారంటూ కాంగ్రెస్ సహా విపక్షాలపై మండిపడ్డారు. తమ పాలనకు పదేళ్లు ముగిశాయి, ఇంకా 20ఏళ్లు మిగిలి ఉందంటూ మోదీ పేర్కొన్నారు. రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానంలో భాగంగా రాజ్యసభలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రసంగించారు. రాష్ట్రపతి ప్రసంగం దేశప్రజలకు ప్రేరణ.. కలించాయని.. దశాబ్దాల తర్వాత దేశంలోని ప్రజలు వరుసగా మూడోసారి సేవ చేసే అవకాశాన్ని కల్పించారని ప్రధాని మోదీ అన్నారు. ఈ సందర్భంగా రాజ్యసభలో రచ్చచోటుచేసుకుంది.. విపక్షాల నినాదాల మధ్యనే ప్రధాని మోదీ ప్రసంగించారు.

తమ విజయాన్ని చూసి కాంగ్రెస్ ఓర్వలేకపోతోందని.. దేశ ప్రజలు మమ్మల్ని పెద్దమనసుతో ఆశీర్వదించారంటూ ప్రధాని మోదీ పేర్కొన్నారు. తమపై విషప్రచారాన్ని ప్రజలు తిప్పికొట్టారని.. అంబేద్కర్ రాజ్యాంగం వల్లే తనలాంటి సామాన్యులు పార్లమెంట్ దాకా రాగలుగుతున్నారన్నారు. రాజ్యాంగం అంటే ఆర్టికల్స్ సమ్మిళితం మాత్రమే కాదు.. రాజ్యాంగంలో ప్రతీవాక్యం మహత్తరమైనది.. రాజ్యాంగం మనందరికీ మార్గదర్శకం అంటూ పేర్కొన్నారు. రాజ్యాంగ స్ఫూర్తి విలువైనదని.. దీపస్తంభంలా పనిచేస్తుందన్నారు. నవంబరు 24న రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకోవాలని నిర్ణయించినప్పుడు ఇక్కడ రాజ్యాంగాన్ని ప్రదర్శిస్తున్న వారు వ్యతిరేకించారంటూ విపక్షాలపై మండిపడ్డారు.

ఈ ఎన్నికల ఫలితాలు పదేళ్ల ప్రగతికి నిదర్శనమే కాదు.. రాబోయే కాలంలో జరిగే అభివృద్ధికి ఈ ఫలితాలు సంకేతమని ప్రధాని మోదీ పేర్కొన్నారు. రాబోయే ఏదేళ్లలో ఎన్నో నిర్ణయాలు తీసుకుంటామని.. రాబోయే కాలంలో మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు.

(మిగతా 2లో)

## రాజధాని అమరావతి పై శ్వేత పత్రం విడుదల చేసిన చంద్రబాబు

**అమరావతి:** ప్రపంచంలోనే అతిపెద్ద భూ సేకరణ ప్రాజెక్టు అమరావతి అని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన రాజధాని అమరావతిపై శ్వేతపత్రం విడుదల చేశారు.

"అమరావతి అనేది ఆ కాలంలో ప్రముఖ నగరం. రాష్ట్ర విభజన జరుగుతుందని, అమరావతి రాజధాని అవుతుందని ఎవరూ ఊహించలేదు. రాజధానికి అమరావతి పేరు పెట్టాలని రామోజీగ్రూప్ సంస్థల ఛైర్మన్ రామోజీ రావు సూచించారు. అమరావతి పేరును క్యాబినెట్‌లో వందశాతం అంగీకరించారు. ప్రతి గ్రామం నుంచి మట్టి నీరు తెచ్చి అమరావతిలో ఉంచాం. యమునా నది నీరు, పార్లమెంట్ మట్టిని ప్రధాని మోదీ తెచ్చారు. దేశంలోని ప్రముఖ దేవాలయాల



పవిత్ర జలం, మట్టి తెచ్చాం. ఆ పవిత్ర జలం, మట్టి మహిమ అమరావతిలో ఉంది. అందుకే అమరావతిని ఎవరూ కదిలించలేకపోయారు. రాష్ట్రంలో ఎటుచూసినా సమదూరంలో ఉన్న ప్రాంతం ఇది. రాష్ట్ర భవిష్యత్తును ఆకాంక్షించే ఎవరైనా అమరావతిని ఒప్పుకోవాలి. విజయవాడ, గుంటూరు మధ్యే రాజధాని ఉండాలని శివరామ కృష్ణ కమిటీ కూడా చెప్పింది. హైదరాబాద్‌ను అభివృద్ధి చేసిన అనుభవం నాకు ఉంది. తొమ్మిదేళ్లలో సైబరాబాద్ ప్రాంతాన్ని అభివృద్ధి చేశాం. కృష్ణానది నుంచి నీళ్లు తెచ్చి సైబరాబాద్‌కు ఇచ్చాం.

29 వేల మంది రైతులు 34,400 ఎకరాలు రాజధాని కోసం ఇచ్చారు. రైతులు ఇచ్చిన భూమికి ఏటా పరిహారం ఇచ్చాం. పదేళ్ల వరకు పరిహారం ఇస్తామని రైతులకు చెప్పాం. రైతు కూలీలకు కూడా పరిహారం ఇచ్చాం. రైతులు ఇచ్చింది, ప్రభుత్వ భూమి కలిపి 53,745 ఎకరాలు సమకూరింది. రాజధాని రాష్ట్రానికి నడి మధ్యనే ఉండాలని ఆనాడు ప్రతిపక్షనేతగా జగన్ చెప్పారు. కానీ, అధికారంలోకి వచ్చాక జగన్ ఏం చేశారో ప్రజలే చూశారు. దేశంలో ఏ నగరానికి లేని సౌలభ్యత

(మిగతా 2లో)

## ఏపీ టెట్ (జులై) 2024 సిలబస్‌పై అభ్యర్థుల్లో గందర గోళం..

**అమరావతి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మళ్లీ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) నిర్వహణకు నోటిఫికేషన్ వెలువడిన సంగతి తెలిసిందే. టీచర్ పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీ కంటే ముందుగా మరొకమారు టెట్ నిర్వహిస్తామని చెప్పిన కూటమి సర్కార్.. చెప్పిన మాట ప్రకారంగానే టెట్ (జులై) నోటిఫికేషన్‌ను విద్యాశాఖ విడుదల చేసింది. ఇందుకు సంబంధించిన వివరణాత్మక నోటిఫికేషన్, ఇన్ఫర్మేషన్ బులిటెన్, షెడ్యూల్, సిలబస్ వంటి



తదితర వివరాలు కూడా ఇప్పటికే వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. నేటి నుంచి రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లింపులకు అవకాశం కల్పించామని, గురువారం ఆన్‌లైన్ దరఖాస్తులు కూడా చేసుకోవచ్చని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్ సురేష్ కుమార్ వెల్లడించారు.

అయితే, టెట్ (జులై) పరీక్షకు సంబంధించి సిలబస్ విషయమై అభ్యర్థుల్లో గందరగోళం నెలకొంది. ఆగస్టులో నిర్వహించే టెట్ పరీక్షలకు పాత సిలబస్ ప్రకారంగా ప్రశ్నాపత్రం తయారు చేయనున్నట్లు సోషల్

(మిగతా 2లో)

## జగన్ అక్రమాస్తుల కేసులో కీలక పరిణామం



మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్ అక్రమాస్తుల కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. జగన్‌పై ఉన్న కేసుల గురించి దాఖలైన పిటిషన్ మీద తెలంగాణ హైకోర్టు బుధవారం విచారణ చేపట్టింది. సీబీఐ కోర్టులో ఉన్న జగన్ కేసులను రోజువారీగా విచారించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

జగన్ కేసులపై గతంలో హరిరామ జోగయ్య హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై

(మిగతా 2లో)

## 132 సీట్ల బస్సు.. విమానం తరహాలో సౌకర్యాలు : నితిన్ గడ్కరీ

కాలుష్యం అనేది దేశంలో అతిపెద్ద సమస్యగా మారిందని, ఈనేపథ్యంలో వ్యక్తిగత, ప్రజారవాణాను మరింత సౌకర్యవంతంగా మార్చేందుకు కాలుష్య రహిత మార్గాలను అన్వేషిస్తున్నామని కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. ఓ జాతీయ వార్తా ఛానల్ ఇటీవల నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. 132 సీట్లతో కూడిన బస్సులను అందుబాటులోకి తెచ్చే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఇందుకోసం నాగ్‌పూర్‌లో పైలట్ ప్రాజెక్టు కొనసాగుతోందని చెప్పారు.

"కాలుష్యం ముప్పును ఎదుర్కొనేందుకు దిగుమతి ప్రత్యామ్నాయం, కాలుష్యరహిత ఇంధనం, స్వదేశీ పరిజ్ఞానం, తక్కువ ఖర్చు వంటి పరిష్కార మార్గాలు అవసరం. ఇప్పటికే ఎలక్ట్రిక్ వాహనాలు వచ్చాయి. వందల సంఖ్యలో ఇథనాల్ పంపులు ఏర్పాటు కానున్నాయి. రూ.120 లీటరు పెట్రోల్‌కు ఖర్చుపెట్టే బదులు.. రూ.60తో



ఇథనాల్ వాడొచ్చు. డీజిల్ బస్సు కి.మీ. ప్రయాణానికి రూ.115 ఖర్చు అవుతుంది. అదే ఎలక్ట్రిక్ ఏసీ బస్సుకు రూ.50 నుంచి రూ.60 అవుతుంది. దీంతో టికెట్ ధర 15 నుంచి 20 శాతం తగ్గుతుంది" అని నితిన్ గడ్కరీ వెల్లడించారు.

**పైలట్ ప్రాజెక్టు..**

"చెక్ రిపబ్లిక్‌కు వెళ్లినప్పుడు.. అక్కడ మూడు బస్సులు కలిపి ఒకే ట్రాలీ బస్సుగా ఉండటం చూశాను. ఇక్కడ కూడా టాటా సహకారంతో నాగ్‌పూర్‌లో ఓ పైలట్ ప్రాజెక్టు చేపట్టాం. మన ప్రాజెక్టులోనూ 132 మంది కూర్చునే విధంగా బస్సును రూపొందిస్తున్నాం. 40 కి.మీ. దూరం వెళ్లాక ఛార్జింగ్ చేసుకోవాల్సి ఉంటుంది. కేవలం 40 సెకన్ల పాటు ఛార్జింగ్ చేస్తే మరో 40 కి.మీ. వెళ్లొచ్చు. దీంతో కి.మీ. ఖర్చు రూ.35 నుంచి రూ.40 మాత్రమే అవుతుంది" అని కేంద్ర మంత్రి తెలిపారు.

**సౌకర్యాలు ఇలా..**

"ఈ బస్సులో విమానంలోలా సీటింగ్, ఏసీ, సీటు ముందు ల్యాప్‌టాప్ పెట్టుకొనే సౌలభ్యం ఉండాలని సూచించా. ఎయిర్ హోస్టెస్ మాదిరిగా పండ్లు, ప్యాక్ చేసిన ఆహారం, శీతల పానీయాలు అందించేందుకు 'బస్ హోస్టెస్' ఉంటారు. డీజిల్ బస్సుతో పోలిస్తే దీని నిర్వహణకు 30శాతం ఖర్చు తగ్గుతుందని అంచనా వేస్తున్నాం. ఒకవేళ సోలార్ పవర్ వినియోగిస్తే ఈ ఖర్చు మరింత తగ్గుతుంది' అని నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. ఇలా దేశంలో కాలుష్యరహిత రవాణా నదుపాయాలను మరింత మెరుగుపరిచేందుకు అనేక మార్గాలు అన్వేషిస్తున్నామని చెప్పారు.

## కష్టాల సుడిగుండంలో కవిత.. !



దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఢిల్లీ లిక్కర్ కుంభకోణంలో అరెస్టయి తీహార్ జైల్లో ఉన్న బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు ఊరిట లభించే అవకాశం లేకుండా పోయింది. షాకుల మీద షాకులు వరుస షాకులతో తీహార్ జైల్లోనే కెసిఆర్ తనయ కవిత విలవిలలాడుతోంది. తాజాగా ఢిల్లీ లిక్కర్ కుంభకోణంలో అరెస్ట్ అయిన కవితకు మరోమారు ఊహించని షాక్ తగిలింది.

**కవిత కస్టడీ మళ్ళీ పొడిగింపు**

కవిత జ్యుడీషియల్ కస్టడీని రౌస్ అవెన్యూకోర్టు మరోమారు పొడిగించింది. కవిత కస్టడీని జులై 25వ తేదీ వరకు పొడిగిస్తూ ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు న్యాయమూర్తి తీర్పునిచ్చారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తీహారు జైలు నుంచి విచారణకు హాజరైన కవిత కు, ఈడీ కేసులో విచారణ జరిపిన అనంతరం కవిత కస్టడీని పొడిగిస్తున్నట్టు న్యాయమూర్తి తెలిపారు.

**పీకల్లోతు కష్టాల్లో కవిత**

ఇదిలా ఉంటే ఢిల్లీ లిక్కర్ కుంభకోణంలో మార్చి 15వతేదీన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను హైదరాబాద్ లో ఈడీ అధికారులు అరెస్ట్ చేశారు. ఆ తర్వాత ఢిల్లీ లిక్కర్ కుంభకోణం లో సిబీఐ కూడా ఎంట్రీ ఇవ్వడంతో కవిత పీకల్లోతు కష్టాల్లో మునిగిపోయారు. ఓవైపు ఈడి మరోవైపు సిబిఐ కవితపై మూకుమ్మడిగా దాడి చేస్తూ సంచలన ఆరోపణలు చేస్తూ ఎప్పటికప్పుడు కవిత కేసులో కొత్త అంశాలతో చార్జి షీట్లను ఫైల్ చేస్తున్నారు.

**కవితపై ఈడీ, సీబీఐ మూకుమ్మడి దాడి**

దీంతో కవిత బయటకు రావడం కష్టంగా మారింది. ఆమ్ ఆద్మీ పార్టీకి కవిత వంద కోట్ల రూపాయల లంచం ఇచ్చారని, ఆ 100 కోట్ల లంచం సొమ్మును సౌత్ గ్రూప్ సిండికేట్ నుంచి కవిత వసూలు చేశారని ఈడీ ఛార్జ్ షీట్లలో పేర్కొంది. ఇక సిబిఐ కూడా ఈ కేసులో ప్రధాన సూత్రధారి కవిత అంటూ ఛార్జ్ షీట్ లో కీలక విషయాలు వెల్లడించింది.

**కవితకు మళ్ళీ షాకిచ్చిన రౌస్ అవెన్యూ కోర్టు**

దాదాపు నాలుగు నెలలుగా బెయిల్ కోసం ప్రయత్నిస్తున్న కవితకు బెయిల్ దొరకకపోగా ఆమె కస్టడీని మళ్ళీ మళ్ళీ రౌస్ అవెన్యూ కోర్టు పొడిగిస్తూ పోతుంది. ఇక తాజాగా కూడా కవితకు రౌస్ అవెన్యూ కోర్టు మరోమారు కస్టడీని పొడిగించి షాక్ ఇచ్చింది.

## బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ : జిల్లా ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటా

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** విశాఖపట్నం జిల్లా ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానని, వారి అవసరాలను తీరుస్తానని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. ప్రజలు తనని ఎప్పుడైనా కలవొచ్చని అన్నారు. ఇప్పటి వరకు పలు విభాగాల్లో, పలు స్థానాల్లో పని చేశానని, అన్ని వర్గాల వారి కష్టాలు, సమస్యలు తెలుసని వాటి పరిష్కారం కోసం నిరంతరం శ్రమిస్తానని చెప్పారు. విశాఖ జిల్లా నూతన కలెక్టర్ గా ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ బుధవారం కలెక్టరేట్లోని తన ఛాంబర్లో ఉదయం 10.11 గంటలకు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై స్పందించారు. అంతర్జాతీయ ఖ్యాతి గడించిన విశాఖ సర్వతోముఖాభివృద్ధికి అవిరళ కృషి చేస్తానని ఉద్ఘాటించారు. పర్యాటకంగా గుర్తింపు పొందిన ఈ ప్రాంతానికి మరింత గుర్తింపును తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. ముఖ్యంగా అర్బన్ ప్రాంతంలో ఉండే ప్రధాన సమస్యల పరిష్కారంపై దృష్టి సారిస్తానని, ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామని



చెప్పారు. ఆరోగ్య శ్రీ ద్వారా అందరికీ సేవలు అందేలా చర్యలు తీసుకుంటానని, వైద్యపరమైన సేవలను మరింత విస్తృతం చేస్తానని, రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రజల సంక్షేమానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

యువత నైపుణ్యానికి, ఉపాధికి ప్రాధాన్యం రాష్ట్రంలో విశాఖపట్టణానికి ఓ ప్రత్యేకత ఉందని, రాష్ట్ర ప్రభుత్వం ఈ నగరాన్ని ఆర్థిక రాజధానిగా కూడా భావిస్తోందని గుర్తు చేశారు. ఆ లక్ష్యాలకు అనుగుణంగా కార్యాచరణ రూపొందించుకొని యువతకు అన్ని అంశాల్లో నైపుణ్య శిక్షణ అందిస్తామని, ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటానని చెప్పారు. ప్రభుత్వ పాలసీకి అనుగుణంగా అన్ని రకాల కంపెనీలు వచ్చేందుకు తనవంతు కృషి చేస్తానని అన్నారు. ఆర్థిక, వాణిజ్య అంశాలే అజెండాగా కార్యాచరణ రూపొందించుకొని ముందుకు సాగుతానని, నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా అందరి సహకారంతో జిల్లా సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తానని జిల్లా నూతన కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు.

కలెక్టర్‌కు అధికారులు, ప్రముఖుల శుభాకాంక్షలు జిల్లా నూతన కలెక్టర్ గా బుధవారం బాధ్యతలు స్వీకరించిన ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ కు జిల్లా అధికారులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. తన ఛాంబర్లో కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. జిల్లా జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ, ఏడీసీ కె.ఎస్. విశ్వనాథన్, జిల్లా రెవెన్యూ అధికారి కె. మోహన్ కుమార్, విశాఖపట్టణం ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, భీమిలి ఆర్డీవో భాస్కర రెడ్డి,

(మిగతా 2లో)

## 89, 92 వార్డులలో జీవీఎంసీ కమిషనర్, పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులు పర్యటన



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ 8వ జోన్ 89 , 92 వార్డుల పరిధిలోని కొత్తపాలెం లోని ఎర్ర చెరువు, గోపాలపట్నం ప్రాథమిక ఉన్నత పాఠశాల తదితర ప్రాంతాలలో జివిఎంసి కమీషనర్ సిఎం.సాయికాంత్ వర్మ, విశాఖ పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులు పి.జి.వి.ఆర్ నాయుడు (గణబాబు), జివిఎంసి అధికారులతో కలిసి పర్యటించారు.

ముందుగా కమిషనర్, విశాఖ పశ్చిమ నియోజకవర్గం శాసన సభ్యులు గోపాలపట్నం ప్రాథమిక ఉన్నత పాఠశాలలో మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల అర్పించారు. ఈ సందర్భంగా పశ్చిమ నియోజకవర్గం శాసన సభ్యులు గోపాల్ పట్నం హైస్కూలు స్వర్ణోత్సవాలు జరుపుకున్న పురాతనమైన స్కూల్ అని ఇక్కడ నుండి ఎంతోమంది క్రీడాకారులు జాతీయస్థాయిలో పలు క్రీడల్లో రాణించారని తెలిపారు. ఈ స్కూల్లో ఉన్న క్రీడా మైదానంలో లైటింగ్ తో కూడిన వాకింగ్ ట్రాక్, స్కేటింగ్ రింక్, 100 మీటర్ల క్రీడా మైదానం, మొదలైనవి అభివృద్ధి చేయాలని శాసనసభ్యులు కమిషనర్ ను కోరగా కమిషనర్ స్పందిస్తూ పరిశీలిస్తామన్నారు.

అనంతరం 89వ

(మిగతా 2లో)

(మొదటి పేజీ తరువాయిలు)

## తమ విజయాన్ని చూసి కాంగ్రెస్ ఓర్వలేకపోతోంది: మోదీ

ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరిస్తుందని ప్రధాని మోదీ అన్నారు. ఇది ప్రతి ఒక్కరిపై ప్రభావం చూపుతుందని.. ప్రతి తరగతికి అభివృద్ధి జరుగుతుందన్నారు. ఇది మాత్రమే కాదు, మూడవ స్థానానికి రావడం ప్రపంచ స్థాయిలో అపూర్వమైన మార్పులను కూడా తీసుకువస్తుందన్నారు.

ప్రభుత్వంపై కాంగ్రెస్ నేతలు విమర్శలు చేస్తున్నారని.. రిమోట్ ప్రభుత్వాన్ని నడపడం కాంగ్రెస్‌కు అలవాటు అంటూ ప్రధాని మోదీ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ఆటో మోడ్ ప్రభుత్వాన్ని కోరుకుంటోంది.. రిమోట్ ప్రభుత్వాన్ని నడపడం ఆ పార్టీకి అలవాటైందంటూ చురకలంటించారు.

పెద్దల సభను విపక్షాలు అవమానిస్తున్నాయని.. ఓడించినా వారి బుద్ధి మారలేదని మోదీ ఆగ్రహం వ్యక్తంచేశారు. 140 కోట్ల భారతీయులను విపక్షం మోసం చేసిందన్నారు. చర్చలో పాల్గొనే ధైర్యం లేక విపక్షాలు వాకౌట్ చేశాయని ఫైర్ అయ్యారు. నిజాలు చెబుతుంటే విపక్షాలు ఓర్వలేకపోతున్నాయని తెలిపారు. పంటల కొనుగోళ్లలో ఎన్నో రికార్డులు సృష్టించామన్నారు. MSPలో కూడా రికార్డు కొనుగోళ్లు జరిగాయని.. రైతులకు సాధికారత కల్పించేందుకు కృషి చేస్తున్నామని మోదీ తెలిపారు. రైతు సంక్షేమమే మా ప్రణాళికలో ప్రధానాంశమని.. రైతులను ఇబ్బందులకు గురిచేయడానికి తాము ఎప్పుడూ అనుమతించలేదంటూ పేర్కొన్నారు.

**విపక్షాలపై చైర్మన్ ధన్కర్ ఫైర్..**

రాజ్యసభలో ప్రధాని మోదీ విపక్షాల నినాదాల మధ్యనే ప్రసంగించారు.. అబద్ధాలను చెప్పొద్దని.. తమను మాట్లాడనివ్వాలని విపక్షసభ్యులు డిమాండ్ చేశారు. ఈ క్రమంలో విపక్షాలు మోదీ ప్రసంగిస్తుండగానే వాకౌట్ చేశారు. కాగా.. విపక్షాల వాకౌట్, సభ్యుల తీరుపై రాజ్యసభ చైర్మన్, ఉపరాష్ట్రపతి ధన్కడ్ సైతం ఆగ్రహం వ్యక్తంచేశారు. విపక్షాలు రాజ్యాంగాన్ని అవమానిస్తున్నాయని.. ఇకనైన తీరును మార్చుకోవాలని సూచించారు.

**రాజధాని అమరావతి పై శ్వేత పత్రం విడుదల చేసిన చంద్రబాబు**

అమరావతికి ఉంది. ఇన్ని కిలోమీటర్ల రివర్ ఫ్రంట్ ఎక్కడా లేదు. ఒక వైపు గోదావరి, మరో వైపు కృష్ణా రెండు నదుల అనుసంధానంతో ఎప్పుడూ ఫ్రెష్ వాటర్ అందుబాటులో ఉంటుంది.

విభజన సమయంలో మనకు లోటు బడ్జెట్‌ఉంది. ప్రాజెక్టు ఏదైనా విన్ విన్ పరిస్థితిలోనే ముందుకు తీసుకెళ్లా. అమరావతిలో పెట్టుబడులు పెట్టేందుకు అనేక మంది ముందుకొచ్చారు. సింగపూర్.. మనకు మాస్టర్‌ప్లాన్ ఇచ్చింది. తొమ్మిది విభాగాల్లో అమరావతి హబ్‌గా మారాలని ఆకాంక్షించాం. ఫైనాన్షియల్, నాలెడ్జ్, టూరిజం, ఎలక్ట్రానిక్, హెల్త్ సిటీ ప్రతిపాదించాం. పచ్చదనానికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చాం. దేశంలోని ఏ నగరానికీ అమరావతిలా సౌలభ్యం లేదు. జగన్ వచ్చాక అమరావతిలో జరుగుతున్న పనులను ఆపేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజావేదిక కూల్చేశారు. ఏ కట్టడం కట్టాలన్నా పదిసార్లు ఆలోచిస్తాం. అమరాతి రైతులను అనేక రకాలుగా అవమానించారు. రాజధాని కోసం భూమి ఇచ్చిన రైతులు రోడ్డున పడ్డారు. శ్రీకాకుళం యాత్రకు వెళ్తే మధ్యలోనే అడ్డుకున్నారు. అమరావతి రైతుల త్యాగం చరిత్ర గుర్తు పెట్టుకుంటుంది" అని చంద్రబాబు వివరించారు.

**ఏపీ టెట్ (జులై) 2024 సిలబస్‌పై అభ్యర్థుల్లో గందరగోళం..**

మీడియాలో జోరుగా ప్రచారం జరుగుతోంది. దీనిపై తాజాగా పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్ సురేష్ కుమార్ క్లారిటీ ఇచ్చారు. ఇది వాస్తవం కాదని కొట్టిపారేశారు. దీనిపై అభ్యర్థులు ఎలాంటి అపోహలకు గురికావొద్దని ఆయన సూచించారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో నిర్వహించిన టెట్ పరీక్షకు నిర్ణయించిన సిలబస్‌నే ప్రస్తుత టెట్ పరీక్షకు కూడా నిర్ధారించినట్లు ఆయన స్పష్టం తెలిపారు.

టెట్ అధికారిక వెబ్‌సైట్లో కూడా దాన్నే అభ్యర్థులకు అందుబాటులో ఉంచినట్లు ఆయన వివరించారు. ఈ సిలబస్ ఆధారంగానే అభ్యర్థులు పరీక్షకు సన్నద్ధం కావాలని, సోషల్ మీడియాలో జరిగే అసత్య ప్రచారాలను నమ్మొద్దని ఆయన సూచిస్తూ ఓ ప్రకటన విడుదల చేశారు. కాగా జులై 4 నుంచి 17 వరకు ఆన్‌లైన్‌లో టెట్‌కు దరఖాస్తు చేసుకోవల్సి ఉండగా.. ఆన్‌లైన్ పరీక్షలు ఆగస్టు 5 నుంచి 20 వరకు జరగనున్నాయి.

## జగన్ అక్రమాస్తుల కేసులో కీలక పరిణామం

ప్రభుత్వ తరఫు న్యాయవాది కోర్టులో వాదనలు వినిపించారు. ఈ కేసులో దర్యాప్తు కొనసాగుతున్నట్లు తెలిపారు. దీనిపై ప్రభుత్వం ఇప్పటికే కౌంటర్ దాఖలు చేసిందన్నారు. తదుపరి విచారణను హైకోర్టు 3 వారాలకు వాయిదా వేసింది.

## జిల్లా ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటా...

కలెక్టరేట్ ఏవో దేవ్ ప్రసాద్, ఇతర విభాగాల సూపరింటెండెంట్లు, ఇతర విభాగాల జిల్లా స్థాయి అధికారులు, వైద్యాధికారులు, తహశీల్దార్లు, ఎంపీడీవోలు, పోలీసు శాఖకు చెందిన అధికారులు తదితరులు కలెక్టర్నుకలిసి శుభాకాంక్షలు తెలిపారు.

## 89, 92 వార్డులలో జీవీఎంసీ కమిషనర్, పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులు పర్యటన

వార్డులో గల కొత్తపాలెం ఎర్ర చెరువును వారు సందర్శించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు ఎర్ర చెరువులో పూడికలు తొలగించి చెరువును అభివృద్ధి చేయాలని తెలుపగా కమిషనర్ పరిశీలించి చర్యలు చేపడతామని శాసనసభ్యులకు హామీ ఇచ్చారు.

ఈ పర్యటనలో జివిఎంసి అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, పట్టణ ప్రణాళిక అధికారి ఇ.సురేష్ కుమార్, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, జోనల్ కమిషనర్ హేమావతి, పర్యవేక్షక ఇంజనీర్లు కేవీఎన్ రవి, రామ్ మోహనరావు, కార్యనిర్వాహక ఇంజనీర్లు రత్నాకర్, ఏడుకొండలు, ఏ.డి.హెచ్.సురేష్ ఏసీపీ రఘునాథరావు తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పాడ తీర ప్రాంతాన్ని పరిశీలించిన ఎపి డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్



**కాకినాడ:** ఎపి డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ బుధవారం ఉప్పాడ తీరంతో సముద్రపు కోతకు గురయిన ప్రాంతాన్ని సందర్శించారు. అక్కడ మారీ టైమ్ బోర్డు, కేంద్ర ఖగోళశాస్త్ర మంత్రిత్వ శాఖ (ఎర్త్ సైన్స్ మినిస్ట్రి) అధికారులు, రెవెన్యూ అధికారులతో చర్చించారు. సముద్రపు కోతకు గల కారణాలు, నివారణ ఉపాయాలను అడిగి తెలుసుకున్నారు. ఉప్పాడ తీరంలోనే సముద్రం ఎందుకు ముందుకు వస్తోంది, దీనికి గల కారణాలు, తీరాన్ని కోతకు గురి కాకుండా చేయాల్సిన మార్గాలు అన్వేషించాలని అధికారులకు పవన్ సూచించారు. ప్రభుత్వం నుంచి పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని, దీనిపై శాస్త్రీయంగా సర్వే నిర్వహించి పనులు మొదలు పెడదామని చెప్పారు. దీనికి శాశ్వత పరిష్కారం చూపేలా అధికారులకు తగు సూచనలు ఇచ్చారు. ఉప్పాడ గ్రామ తీర ప్రాంతంలో మొత్తం 84 ఎకరాల విస్తీర్ణంతో భూమి సముద్రంలో కలిసిపోయిందని జిల్లా సర్వేయర్ లక్ష్మీ నారాయణ తెలిపారు. 60 ఎకరాలు కోతకు గురయ్యాక సర్వే ప్రారంభించినట్టు, సర్వే ప్రారంభించిన తర్వాత మరో 20 ఎకరాలు సముద్రంలోకి వెళ్లిపోయిన విషయాన్ని వివరించారు. మొత్తం యు.కొత్తపల్లి మండల పరిధిలోని 8 తీర ప్రాంత గ్రామాల్లో 1360 ఎకరాలు కోతకు గురైన విషయాన్ని తెలుసుకుని పవన్ కల్యాణ్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. చెన్నై నుంచి ఉప్పాడ తీర ప్రాంత కోతపై పరిశోధన జరిపేందుకు వచ్చిన కేంద్ర ఖగోళశాస్త్ర మంత్రిత్వశాఖ అధికారులు, మారిటైం బోర్డు అధికారులను సముద్రపు కోతపై పూర్తి స్థాయిలో అధ్యయనం జరపాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి, ఎంపీ ఉదయ్ శ్రీనివాస్, పిఠాపురం నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జ్ వర్మ, జనసేన సమన్వయకర్త మర్రెడ్డి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

**సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు పరిశీలన**

యు.కొత్తపల్లి పర్యటనకు వెళుతూ మార్గం మధ్యలో సూరప్ప చెరువు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారులతో కలిసి పరిశీలించారు. నాబార్డు నిధులతో 22 ఎకరాల్లో నిర్మించిన ఈ ట్యాంకు ద్వారా యు.కొత్తపల్లి మండల పరిధిలోని 54 గ్రామాలకు నీరు అందిస్తున్నారు. సమ్మర్ స్టోరేజీ ట్యాంకు, తాగు నీటిని శుభ్రపరిచే విధానం, ల్యాబ్ లు పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాకినాడ కలెక్టర్ షాన్ మోహన్ సగిలి, ఎంపీ ఉదయ్ శ్రీనివాస్, పిఠాపురం జనసేన ఇంఛార్జ్ మర్రెడ్డి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు. ఉప్పాడ తీర ప్రాంతంలో సముద్రపు కోతకు గురైన ప్రాంతాన్ని పరిశీలించేందుకు వెళుతూ గ్రామ గ్రామాన ప్రజలను కలుస్తూ వారి సమస్యలు తెలుసుకుంటున్నారు. పిఠాపురం, నవకంద్రవాడ, వాకతిప్ప, యు.కొత్తపల్లి తదితర గ్రామాల్లో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. దారి పొడుగునా ప్రజలు పవన్ కల్యాణ్ కి స్వాగతం పలుకగా అందరికీ అభివాదం చేసుకుంటూ ముందుకు కదిలారు. అనంతరం యండపల్లి జంక్షన్ వద్ద ఉన్న ఎస్సీ కాలనీని పవన్ సందర్శించారు. కాలనీ వాసులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మంచి నీరు సదుపాయం కల్పించాలని ఈ సందర్భంగా స్థానికులు కోరారు. కొండెవరంలో ఆత్మహత్య చేసుకున్న చక్రధర్ కుటుంబ సభ్యులు తమకు న్యాయం చేయాలని ప్లకార్డులతో ఆందోళన చేపట్టారు. గమనించిన డిప్యూటీ సీఎం పవన్ కాన్వారు ఆపి వాళ్లతో మాట్లాడి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో జడ్పీ సీఈఓ శ్రీరామచంద్రమూర్తి, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎంవీ సత్యనారాయణ, డీపీవో కె .భారతి సౌజన్య, ఆర్డీవో ఇట్ల కిషోర్ ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 10న దేశవ్యాప్త డిమాండ్స్ డే ను జయప్రదం చేయండి



**చింతపల్లి, (విశాఖ సమాచారమ్):** కేంద్రంలో మూడవ దఫా అధికారాన్ని చేపట్టిన మోడీ నాయకత్వంలోని బిజెపి సంకీర్ణ ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాసే లేబర్ కోడ్స్ అమలుకు చేస్తున్న ప్రయత్నాలను తిప్పి కొట్టాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. బుధవారం చింతపల్లి సిఐటియు కార్యాలయంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు పసుపులేటి లక్ష్మి అధ్యక్షతన జరిగిన మధ్యాహ్న భోజన కార్మికుల సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని చిన్నయ్య పడాల్ ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రాగానే కార్పొరేట్ సంస్థలకు మేలు చేసే విధంగా ప్రావిడెంట్ ఫండ్ చట్టంలో పెనాల్టీని తగ్గించి కార్మికులకు అన్యాయం చేసిందని ఆయన విమర్శించారు. బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రైవేటీకరణ విధానాల మూలంగా రైల్వే రంగంలో ప్రమాదాలు జరుగుతున్నాయని, విమానాశ్రయాలకు భద్రత లేకుండా పోతుందని అన్నారు. ఆరుగాలం కష్టించి పంటలు పండించే రైతన్నకి స్వామినాథన్ సిఫార్సులకు అనుగుణంగా కనీస మద్దతు ధర కల్పించేందుకు మోడీ ప్రభుత్వం సిద్ధం కావడం లేదని అన్నారు. ప్రజలకు ప్రభుత్వానికి మధ్య అనుసంధానకర్తలుగా కేంద్ర ప్రభుత్వ పథకాలలో పనిచేస్తున్న స్కీం వర్కర్స్ ను కార్మికులుగా గుర్తించి కనీస వేతనాలు అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమవుతుందని ఆయన దుయ్యబట్టారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక రైతాంగ వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు జులై 10వ తేదీన దేశవ్యాప్తంగా జరుగుతున్న డిమాండ్స్ డే ని జయప్రదం చేయాలని కార్మిక వర్గానికి విజ్ఞప్తి చేశారు. సిఐటియు అనుబంధ కార్మిక సంఘాలు అన్ని మండల కేంద్రాలలో నిరసన ప్రదర్శనలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో మండల అధ్యక్ష కార్యదర్శులు కే పద్మ, మినుముల జ్యోతి, లక్ష్మి, దేవుడమ్మ, పార్వతమ్మ మరియు కార్మికులు పాల్గొన్నారు.

# ఘనంగా భారతీయ క్రైస్తవ దినోత్సవ వేడుక



**చింతపల్లి, (విశాఖ సమాచారమ్):** భారతీయ క్రైస్తవ దినోత్సవంను చింతపల్లి మండల పాస్టర్ ఫెలోషిప్, యుసిడబ్ల్యు మరియు షారోన్ టీమ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా హనుమాన్ కూడలి నుంచి క్రైస్తవ సోదరులు మతసామరస్యాన్ని చాటే విధంగా క్రైస్తవ బోధనలను వివరిస్తూ డిగ్రీ కాలేజ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం చింతపల్లి ప్రాంతీయ అసుపత్రిలో రోగులకు రొట్టెలు, పళ్ళు పంపిణీ చేశారు. అనంతరం ఆయా క్రైస్తవ సంఘ పెద్దలు మాట్లాడుతూ క్రీ.శ. 52వ సంవత్సరంలో ఏసుక్రీస్తు 12 మంది శిష్యుల్లో ఒకరైన తోమ సువార్త నిమిత్తం దక్షిణ భారతదేశంలోని కేరళ రాష్ట్రంలో గల మలబార్ తీరానికి వచ్చి అక్కడ సువార్త చేసి సంఘాన్ని స్థాపించారని, ఆపై క్రీ.శ. 72వ సంవత్సరంలో తమిళనాడులోని చెన్నై సమీపంలో మైలాపూర్ సెయింట్ థామస్ మౌంట్ దగ్గర క్రీస్తు సువార్త నిమిత్తం తోమ తన ఆత్మను, ప్రాణాన్ని దేవుడికి అర్పించాడని, నాటినుండి తోమా బలిదానానికి గుర్తుగా జూలై మూడవ తేదీన సెయింట్ థామస్ డే గా ప్రకటించడం జరిగిందన్నారు. దాదాపు 2వేల సంవత్సరాల సంపన్నమైన భారతీయ క్రైస్తవ్యానికి కారణమైన తోమా సువార్త పరిచర్యను గుర్తు చేసుకుంటూ నేడు భారతీయ క్రైస్తవ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. భారతీయ సాంస్కృతిక వారసత్వ సంపదలో మన గుర్తును కాపాడుకుంటూ, ఐక్యతను పెంపొందిస్తూ, క్రీ.శ. 52లో అపో, తోమ ద్వారా భారతదేశానికి తీసుకురాబడిన ప్రభువైన ఏసుక్రీస్తును ఆయన సువార్తను బట్టి సంతోషించడం అనేది భారతీయ క్రైస్తవ దినోత్సవం యొక్క ముఖ్య ఉద్దేశం అన్నారు. నాటి తోమా సువార్త పరిచర్య ఈ సుదీర్ఘ భారతీయ క్రైస్తవ చరిత్రకు పునాదులు వేసిందని, తోమా నాడు భారతదేశానికి తీసుకువచ్చిన క్రీస్తు సువార్త నేటికీ దేశంలో ఇంకా పరిడవిల్లుతుందని, అనేకమంది జీవితాలని మారుస్తుందని, భారతీయ క్రైస్తవులుగా ఈ దేశాన్ని ప్రభావితం చేయడానికి తోమా సేవ జీవితం నేటి క్రైస్తవ సమాజానికి స్ఫూర్తినిస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల పరిచర్యకులు, సేవకులు పాల్గొన్నారు.

# విశాఖ కు పూర్వ వైభవం రాబోతోంది: విష్ణు కుమార్ రాజు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** అభివృధి కార్యక్రమాల్లో భాగంగా బుధవారం నియోజకవర్గంలో పర్యటించిన విశాఖ ఉత్తర నియోజకవర్గ శాసనసభ్యుడు విష్ణు కుమార్ రాజు స్థానికులతో చాయ్ పే చర్చ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా 51వ వార్డు మాధవధారలో నాయకులతో ముచ్చటిస్తూ కాలనీ సమస్యలు తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ,ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల సారధ్యంలో అవినీతి రహిత పాలన చూడబోతున్నామన్నారు.టీడీపీ,బీజేపీ,జనసేన కూటమి ప్రభుత్వంలో విశాఖకు పూర్వవైభవం రాబోతోందన్నారు.జనసేన సీనియర్ నాయకుడు సంకు వెంకటేశ్వరరావు, బీజేపీ సీనియర్ నాయకుడు పృథ్వీరాజ్ తదితరులతో పలు విషయాలు ముచ్చటిస్తూ విష్ణుకుమార్ రాజు ఆనందంగా గడిపారు.

| | |
|---|---|
| పంచాంగం | గురువారం 04-07-2024<br>క్రోధి నామ సంవత్సరము<br>ఉత్తరాయణం, గ్రీష్మరుతువు<br>జ్యేష్ఠమాసం |
| తిథి | : బ. చతుర్దశి తె. 04.23 |
| నక్షత్రం | : మృగశిర తె. 04.24 |
| వర్జ్యం | : ఉ. 10.13 ల 11.49 |

# విద్యుత్ బిల్లులు ఇలా చెల్లించండి



**గురుద్వారా:** ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) వినియోగ దారులు తమ విద్యుత్తు బిల్లులను ఏపీఈపీడీసీఎల్ మొబైల్‌యాప్, వెబ్‌సైట్ ద్వారా చెల్లించవచ్చని ఆ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీరాజ్ తెలిపారు. ఆర్.బి.ఐ. మార్గదర్శకాలను అనుసరించి ఇకపై ఫోన్‌పే, జీపే, పేటీఎం, ఇతర యూపీఐ యాప్స్‌లో విద్యుత్తు బిల్లులు చెల్లించేటప్పుడు ఏపీఈపీడీసీఎల్ పేరు కనిపించదన్నారు. విద్యుత్తు వినియోగదారులు సంస్థ యాప్‌ని గూగుల్ ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని లేదా.. సంస్థ వెబ్‌సైట్ నుంచిగానీ బిల్లులు చెల్లించాలన్నారు. అయితే వీటి ద్వారా బిల్లులు చెల్లించే సమయంలో వినియోగ దారులు తమ ఫోన్‌పే, జీపే, పేటీఎం వంటి యూపీఐ యాప్స్‌తో పాటు డెబిట్, క్రెడిట్, నెట్ బ్యాంకింగ్, వ్యాలెట్స్, క్యాష్ కార్డులు కూడా వాడుకోవచ్చన్నారు.

# కలక్టరేట్ లో అల్లూరి సీతారామ రాజు జయంతి వేడుకలు



**విజయనగరం:** జూలై 4 వ తేదీన అల్లూరి సీతారామ రాజు జయంతి సందర్భంగా కలె క్టరేట్ ఆడిటోరియం లో ఉదయం 9.30 గంటలకు జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్. అంబేద్కర్ తెలిపారు. జిల్లా అధికారులు, కలెక్టరేట్ ప్రాంగణం లో నున్న కార్యాలయాల అధికారులు సిబ్బంది ఈ వేడుకలకు హాజరు కావాలని ఆదేశించారు. అదేవిధంగా అన్ని జిల్లా , డివిజినల్, మండల, గ్రామ స్థాయి కార్యాలయాల్లోనూ అల్లూరి జయంతి వేడుకలను నిర్వహించాలని సర్క్యులర్ జారీ చేసారు.

# బృహత్తర ప్రణాళికతో గాజువాక అభివృద్ధి... పల్లా



**గాజువాక, (విశాఖ సమాచారమ్):** గాజువాక నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి కావాల్సిన ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్లు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తెలిపారు.ఈ మేరకు గాజువాక జోనల్ కార్యాలయంలో వివిధ వార్డుల కార్పొరేటర్లు,ఆయా శాఖల అధికారులతో బుధవారం ఆయన తొలిసారిగా సమీక్ష నిర్వహించారు. విద్యుత్, తాగునీరు,పార్కులు, డ్రైనేజీ వ్యవస్థ, క్రీడా మైదానాలు,రోడ్లు తదితర అంశాలపై రెండున్నర గంటల పాటు సమీక్ష జరిపారు.అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ గాజువాకను రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో తాను పని చేస్తానని చెప్పారు.శాఖలన్నింటినీ సమన్వయ పరచి అభివృద్ధి కార్యక్రమాలు దశల వారీగా చేపడతామని తెలిపారు. వ్యవస్థలన్నింటినీ ప్రక్షాలన చేయడం ద్వారా అభివృద్ధి అన్నది మరింతగా మెరుగుపడుతుందన్నారు. జోనల్ కమిషనర్ బంటు సన్యాసి నాయుడు,జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

# ఈ నెల 15 లోగా హిందీ పరీక్షల ఫీజు చెల్లించాలి

**భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్):** దక్షిణ ప్రాంత హిందీ ప్రచార సభ ( చెన్నై) సెప్టెంబర్ లో నిర్వహించనున్న వివిధ హిందీ పరీక్షలకు అపరాధ రుసుము లేకుండా ఈ నెల 15 లోగా ఫీజులు చెల్లించాలనిస్థానిక ఆదర్శ హిందీ ప్రేమీ మండలి పేర్కొంది. స్థానికం గా బుధవారం విడుదల చేసిన పత్రిక ప్రకటన లో మండలి వ్యవస్థాపక అధ్యక్షులు కె ఎస్ ఆర్ కృష్ణారావు పేర్కొంటూఈ ఏడాది సెప్టెంబర్ 14,15 తేదీల్లో నిర్వహించనున్న హిందీ పరిచయ్, ప్రాథమిక, మాధ్యమిక, రాష్ట్ర భాష, ప్రవేశిక, రాష్ట్ర భాష విశారద పూర్వార్ధ, ఉత్తరార్ధ, రాష్ట్ర భాష ప్రవీణ పూర్వార్ధ, ఉత్తరార్ధ తదితర హిందీ పరీక్షలు హాజరువుతున్న భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాలకు చెందిన విద్యార్థులకు భీమిలి లో గలజీవీఎంసీ నెహ్రూ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రం అని ఆయన తెలిపారు.అలాగే హిందీ పరీక్షలకు హాజరువుతున్న విద్యార్థులకు ఆదర్శ హిందీ ప్రేమీ మండలి గత కొన్నేళ్లుగా ఉచితం గా శిక్షణ కూడా ఇస్తున్నదని ఆయన పేర్కొన్నారు. ఇతర వివరాలకు 8985897419,8985647419 నంబర్లకు సంప్రదించాలని అయన కోరారు.

విశాఖ సమాచారమ్

గురువారం 04-07-2024

## ముఖేష్ అంబానీ ఏమన్నారు?

దేశాన్ని ఎప్పుడూ దోచుకున్న కుటుంబంతో పనికిమాలిన వ్యక్తి, ప్రతి ఎన్నికల ర్యాలీలో నన్ను కించపరుస్తాడు!

ఈరోజు, నేను ఆయనను కొన్ని ప్రశ్నలు అడుగుతున్నాను, మీడియా కూడా ఆయనను అడుగుతుందని ఆశిస్తున్నాను.

(1) నేను మరియు నా కుటుంబం ప్రతి సంవత్సరం దేశానికి దాదాపు 50,000 కోట్ల రూపాయల పన్నులు చెల్లిస్తున్నాము. మేము లక్షలాది మందికి ఉద్యోగాలు మరియు లక్షలాది కుటుంబాలకు వారి జీవనోపాధి కోసం జీతాలు అందిస్తున్నాము.

రాహుల్ గాంధీ కుటుంబం ఈ దేశానికి డబ్బు పరంగా ఎంత సహకారం అందిస్తోంది...!

పన్ను ఎగవేత కేసులో మొత్తం కుటుంబం బెయిల్‌పై బయటకు వచ్చిందని, మీ అమ్మ దేశం నుండి వేలకోట్ల రూపాయలు దోచుకుని ప్రపంచంలోనే నాల్గవ సంపన్న మహిళ అయ్యిందని విన్నాను. మీ కుటుంబ వ్యాపారం ఏమిటి? మీ అమ్మ దగ్గర ఈ డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందో దేశ ప్రజలకు చెప్పండి, దయచేసి దీని గురించి వివరించండి?

(2) మేము గత 40 సంవత్సరాలుగా బ్యాంకుల నుండి రుణాలు తీసుకుంటున్నాము మరియు మేము వడ్డీకి లక్షల రూపాయలు చెల్లిస్తాము. మనలాంటి ప్రతి పారిశ్రామికవేత్త, వ్యాపారి మరియు వ్యాపారవేత్త రుణాలు తీసుకుంటారు మరియు హామీలు కూడా ఇస్తారు.

అందుకే బ్యాంకులు పేదలకు ఎఫ్‌డీలపై వడ్డీ చెల్లిస్తాయి.

మీలాంటి నాయకులు, మీ బావగారు బ్యాంకుల్లో ఉచిత (వడ్డీ లేని) రుణాలు ఎందుకు తీసుకున్నారో చెప్పండి? వ్యాపారం ఏమిటి? ఈ వ్యాపారం ఏ దేశంలో నిర్వహిస్తుంది? మీకు ఏ దేశాల్లో ఎంత ఆస్తి ఉంది...!

(3) మీ బావ 15 ఏళ్ల క్రితం లక్ష రూపాయలతో ఏ వ్యాపారం ప్రారంభించాడు, 10 ఏళ్లలో 10,000 కోట్ల ఆస్తికి ఎలా యజమాని అయ్యాడు? అతనికి అంత డబ్బు, భూమి ఎక్కడి నుంచి వచ్చాయి? లండన్‌లో 2 బంగ్లాలు, 6 ఫ్లాట్లు కొనుక్కోవడానికి మీ బావకి డబ్బు ఎలా వచ్చింది...!

నా ప్రియమైన దేశప్రజలారా, ఈ కుటుంబం విదేశీ ఏజెంట్ అని, ఈ పార్టీ దేశద్రోహులకు మద్దతు ఇస్తుందని తెలిసి కాంగ్రెస్‌కు బలవంతంగా విరాళాలు ఇవ్వడం మానేశాను. అప్పటి నుంచి నా పరువు తీస్తూ నా వెంటే ఉన్నారు.

లేకపోతే నువ్వే చెప్పు. మన్మోహన్ ప్రభుత్వ హయాంలో 5000 కోట్ల ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ మెట్రో కాంట్రాక్ట్ మరియు 3900 కోట్ల ముంబై మెట్రో కాంట్రాక్ట్ అందుకున్నప్పుడు, దానిని ప్రభుత్వ కంపెనీకి ఎందుకు ఇవ్వలేదు...!

ఢిల్లీలో, (గతంలో DESU) DVB యొక్క 1200 కోట్ల విద్యుత్ సరఫరా కాంట్రాక్టును NTPC (ప్రభుత్వ సంస్థ)కి బదులుగా సోనియా గాంధీ సిఫార్సుపై షీలా దీక్షిత్ నాకు ఇచ్చారు.

2004 మరియు 2014 మధ్య, కాంగ్రెస్ నా కంపెనీ రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ 8 జాతీయ రహదారి ప్రాజెక్టులు మరియు యుపి, ఒడిశా, తమిళనాడు, కర్ణాటక మరియు పంజాబ్‌లలో మొత్తం 25350 కోట్ల విలువైన ఇతర ప్రాజెక్టులను అందజేసింది.

ఈ పని చేయగలిగే అనేక ప్రభుత్వ సంస్థలు ఉన్నప్పటికీ " ఇవి ప్రజలకు తెలియని కొన్ని నిజాలు.

## డైట్ లో ప్లాస్టిక్ బ్యాగ్‌ల రహిత దినోత్సవం




భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్): స్థానిక జిల్లా విద్యా శిక్షణ సంస్థ( డైట్) లో బుధవారం అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ ల రహిత దినోత్సవం జరిగింది. కార్యక్రమం లో పాల్గొన్న డైట్ ప్రిన్సిపాల్ ఎం జ్యోతి కుమారి మాట్లాడుతూ పూర్వ కాలం లో మట్టి పాత్రలు,లోహ పత్రాలు చెక్కతో తయారయిన వస్తువులను వాడేవారని, అయితే ఆధునిక ప్రపంచం లో సాంకేతిక అభివృద్ధి వల్ల నేడు ఎక్కడ చూసిన ప్లాస్టిక్ వస్తువుల వాడకం ఎక్కువ అయి మానవాళి మనుగడకు ముప్పు వాటిల్లుతున్నదని ఆమె ఆందోళన వ్యక్తం చేసారు. వాటిని నిరోధించడానికి ప్రతి ఏడాది జులై 3 న అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ ల రహిత దినోత్సవం ను జరుపుకొంటున్నామని ఆమె అన్నారు.

డైట్ అధ్యాపకులు, పర్యావరణ కార్యకర్త గొట్టేటి రవి మాట్లాడుతూ నేడు ప్రజలు యూజ్ అండ్ త్రో విధానానికి అలవాటు పడడం వల్లనే సమాజం లో ప్లాస్టిక్ వాడకం మహమ్మారి ల ఎక్కువ అయ్యిందని ఆయన అన్నారు. కావున పర్యావరణ పరిరక్షణ కు భవిష్యత్ తరాల మనుగడకు ప్లాస్టిక్ వాడకాన్ని అపివేసి ప్రత్యామ్నాయ మార్గాలను అనుసరిం చాలని ఆయన కోరారు. ఈ సందర్భం గా ఛాత్రో పాధ్యాయులు, అధ్యాపకులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమం లో అధ్యాపకులు ఎల్ సుధాకర్, నాగేశ్వం'రావు, మాధవి, త్రినాథరావు తది తరులు పాల్గొన్నారు.

## బాధిత బాలికలు మహిళలకు అండగా దిశా వన్ స్టాప్ సెంటర్




విజయనగరం: వివిధ సందర్భాలలో బాధిత బాలికలు మరియు మహిళలకు అండగా దిశా వన్ స్టాప్ సెంటర్ ను వినియోగించికోవాలని ఈ రోజు దిశా వన్ స్టాప్ సెంటర్ ను సందర్శించి న గౌ కె. విజయ కళ్యాణి సీనియర్ సివిల్ జడ్జి మరియు కార్యదర్శి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, విజయనగరం వారు తెలియ జేసిరి, ఈ సెంటర్ లో ఆసిడ్ దాడులు, ప్రేమ వైఫల్యం, వరకట్నం వేధింపులు, ఆత్మహత్య ప్రయత్నం, కుటుంబ తగాదాలు, మైనర్ లకు బలవంత వివాహాలు, వ్యభిచార వృత్తి లోకి దించే వేధింపులు, బాలికల అపహరణ, బిక్షాటన లోకి దించడం మొదలగు కారణాలతో బాధిత మహిళలకు కౌన్సిలింగ్, వైద్యం, న్యాయం, రక్షణ, పునరావాసం, మొదలగు ఐదు రకాలైన సేవలను ఒకే చోట అందించే సంస్థ వన్ స్టాప్ సెంటర్ అని జడ్జి గారు తెలియ జేసిరి కార్యలయం లోని దాస్త్రాలను పరిశీలించిరి

ఈ కార్యక్రమం లో ఒనస్టాప్ సెంటర్ సిబ్బంది, జిల్లా న్యాయ సేవాధికార సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రత్యేక హెూదా.. రైల్వే జోన్.. అయిదేళ్లు మరిచావా జగన్?

ఏపీ అభివృద్ధికి, ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు కూడా.. రాష్ట్రానికి ప్రత్యేక హెూదా అవసరమే. ఇక, విశా ఖలో రైల్వేజోన్ ఏర్పాటు కూడా.. అత్యంత కీలకమే. అయితే.. వీటిని సాధించుకునే క్రమంలోనే రాజకీయ నాయకులు వ్యవహరిస్తున్న తీరు.. చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా మాజీ సీఎం జగన్ అనుసరిస్తున్న వైఖరి మరింత వివాదంగా.. విడ్డూరంగా కూడా ఉందనే చర్చ సాగుతోంది. దీనికి కారణం.. అధికారంలో ఉంటే.. ఈ రెండు అంశాలు ఆయనకు గుర్తుండవు.

గుర్తున్నా.. ఉన్నట్టు నటిస్తారే తప్ప.. కార్యాచరణకు వచ్చే సరికి కుప్పిగంతులు వేస్తూనే ఉన్నారు. అదే అధికారంలో లేకపోతే.. మాత్రం ఇంటా బయటా కూడా.. గళం వినిపిస్తారు. ఇంకేముంది.. ఏపీ ప్రజలకు అన్యాయం జరుగుతోందని అంటారు. 2014-19 మధ్య ఇదే జరిగింది. తాను అధికారంలో లేకపోవడంతో జగన్‌కు ప్రత్యేకహెూదా, విశాఖ రైల్వే జోన్ వంటివాటితోపాటు.. విభజన చట్టంలోని అంశాలు కూడా బాగానే గుర్తున్నాయి. అందుకే అప్పట్లో రాష్ట్రంలో పెద్ద ఎత్తున యాగీ చేశారు.

అప్పటి చంద్రబాబు ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ప్రత్యేక హెూదా స్థానంలో ప్యా కేజీకి అంగీకరించడాన్ని ఊరూవాడా తిరుగుతూ... ఏకేశారు. దీంతో కేంద్రంతో గొడవ పడేలా.. టీడీపీ-బీజేపీ బంధం తెగిపోయేలా పక్కా ప్లాన్‌తో వ్యవహరించారు. ఫలితంగా చంద్రబాబు వీధికెక్కారు. ధర్మపోరాట దీక్షలు అంటూ.. ఢిల్లీలో నిరసన తెలిపారు. తర్వాత.. ఎన్నికల్లో జగన్ విజయం దక్కించుకున్నారు. చి త్రం ఏంటంటే.. అప్పటి వరకు.. హెూదా, జోను అంటూ.. వ్యాఖ్యానించిన జగన్‌కు అధికారంలోకి వచ్చిన తర్వాత ఇవేవీ గుర్తు లేవు.

ఢిల్లీ వెళ్లిన ప్రతిసారీ.. ప్లీజ్-ప్లీజ్ అంటున్నానని చెప్పినా.. 22 మంది లోక్‌సభ సభ్యులు, 8 మంది(అప్ప ట్లో) రాజ్యసభ సభ్యులు ఉన్నా.. జగన్ ఏమీ సాధించకుండానే.. ఐదేళ్లు గడిపేశారు. ఇక, ఇప్పుడు మళ్లీ విపక్షంలోకి మారగానే.. మరోసారి రైల్వే జోన్, హెూదాల జపం చేస్తున్నారు. తాజాగా పార్లమెంటులో మాట్లాడిన వైసీపీ ఎంపీ తనూజా రాణి, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డిలు ఈ రెండు అంశాలను ప్రస్తావించారు. టీడీపీ ఇప్పుడు ఎన్డీయేలో భాగస్వామ్య పార్టీ అని.. హెూదాను సాధించుకునేందుకు ఇదే మంచి తరుణమని రాణి చెప్పారు.

రైల్వే జోన్ సుదీర్ఘ కాల డిమాండ్ అని.. దీనిని సాధించాలని.. వైవీ చెప్పుకొచ్చారు. అయితే.. అధికారంలో ఉన్నప్పుడు మాత్రం వీటిని ఇంత గట్టినా అడిగిన ధాఖలాలు లేకపోవడం గమనార్హం. కట్ చేస్తే.. ఇక్కడ మరో అంశం కూడా ఆసక్తిగా మారింది. ప్రస్తుతం లోక్ సభలో వైసీపీకి నలుగురు ఎంపీలు, రాజ్యసభలో 11 మంది సభ్యులు ఉన్నారు. అంటే.. మొత్తం15 మంది. ప్రస్తుతం టీడీపీకి ఉన్న బలం 16 మంది. వీరితో పోల్చితే.. వైసీపీకి, టీడీపీకి పెద్ద తేడా లేదు.

పైగా టీడీపీకి ఉన్న ఎంపీలు లోక్‌సభలో మాత్రమే. ఇక్కడ బీజేపీకి భారీ బలమే ఉంది. కానీ, వైసీపీకి ఉన్న 11 మంది రాజ్యసభలో ఉన్నారు. వీరి బలం బీజేపీకి లేకపోతే.. కీలక బిల్లులు ఆమోదం పొందే అవకాశం లేదు. ఈ నేపథ్యంలో ఇప్పుడు ఏవైతే.. వైసీపీ డిమాండ్ చేస్తోందో.. వాటి కోసం రాజ్యసభలో గట్టిగా పట్టుబడితే.. కేంద్రం దిగిరాక తప్పదు. మరి ఆ పని చేస్తుందా? అనేది ప్రశ్న. రైల్వే జోన్, ప్రత్యేక హెూదా కోసం రాబోయే ఏదైనా బిల్లుకు వ్యతిరేకంగా ఓటేస్తామని.. వైసీపీ ప్రకటించగలదా? అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. ఎలా చూసుకున్నా.. ప్రతిపక్షంలో ఉంటే ఒకలా.. అధికార పక్షంలో ఉంటే మరోలా వ్యవహరించడం.. వైసీపీకి ఆనవాయితీగా మారిందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

## ఆంధ్రప్రదేశ్ టెట్, మెగా డీఎస్సీపై ప్రభుత్వం కీలక నిర్ణయం

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో టెట్, మెగా డీఎస్సీ పరీక్షలకు సంబంధించి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు అభ్యర్థులకు సమయమివ్వాలని నిర్ణయించింది. అభ్యర్థుల విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. త్వరలోనే టెట్, డీఎస్సీ పరీక్షల తేదీలను ప్రకటించనుంది. ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు సీఎంగా చంద్రబాబు ప్రమాణస్వీకారం చేసిన వెంటనే 16,347 టీచర్ పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీ ఫైల్‌పై తొలి సంతకం చేసిన విషయం తెలిసిందే. ఈ మొత్తం ప్రక్రియ 6 నెలల్లో పూర్తిచేసేలా కార్యాచరణ రూపొందించాలని మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. కొత్తగా బీఈడీ, డీఎడ్ పూర్తి చేసుకున్న వారికీ మెగా డీఎస్సీలో అవకాశం కల్పించనున్నారు.

టెట్, మెగా డీఎస్సీ పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు మరింత సమయం కావాలని విద్యార్థి, యువజన సంఘాల నేతలు, పలువురు ఎమ్మెల్సీలు లోకేశ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. ప్రిపరేషన్‌కు సమయం ఇస్తే బాగుంటుందని కోరడంతో వారి విజ్ఞప్తుల్ని పరిశీలించిన ఆయన.. విద్యాశాఖ ఉన్నతాధికారులతో సమీక్షించారు. అభ్యర్థులకు టెట్‌కు 90 రోజులు, మెగా డీఎస్సీకి 90 రోజుల సమయం ఇవ్వాలని నిర్ణయించినట్లు సమాచారం. త్వరలోనే టెట్, డీఎస్సీ నిర్వహణకు కొత్త తేదీలను ప్రభుత్వం ప్రకటించనుంది. మొత్తంగా ఈ ఏడాది డిసెంబర్‌లోగా ఉద్యోగాల భర్తీ ప్రక్రియను పూర్తి చేసి 2025 జనవరి నాటికి ఉద్యోగాలు ఇచ్చేలా కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులను మంత్రి లోకేశ్ ఆదేశించినట్లు సమాచారం.

## కలెక్టర్ గా పవర్ ఫుల్ లేడీ..!

ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం ప్రస్తుతం ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల బదిలీలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ గా చదలవాడ నాగరాణికి ముఖ్యమంత్రి చంద్రబాబు అవకాశమిచ్చారు.

ఈ చదలవాడ నాగరాణి ఎవరో తెలిస్తే ఆశ్చర్యపోతారు. గుంటూరు జిల్లాకు చెందిన ఐపీఎస్ అధికారి ఉమేశ్ చంద్ర సతీమణే ఈమె. ఉమేశ్ చంద్ర వివిధ జిల్లాలకు ఎస్పీగా పనిచేశారు. రాయలసీమ జిల్లాల్లో 1990వ దశకంలో ఫ్యాక్షనిస్టులను అణచివేశారు. ఉమేశ్ చంద్ర పేరు చెబితే కొమ్ములు తిరిగిన ఫ్యాక్షనిస్టులు కూడా వణికిపోయేవారని అంటారు. అలాగే నక్సలైట్లనూ కూడా ఆయన ఏరిపారేశారు. దీంతో ఆయన నక్సల్స్ హిట్ లిస్టులో



చేరారు.

ఈ క్రమంలో 1999లో హైదరాబాద్ లోని ఎస్సార్ నగర్ జంక్షన్ వద్ద కారులోవెళ్తుండగా నలుగురు నక్సలైట్లు ఆయన కారుపై కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో ఉమేశ్ చంద్ర గన్ మెన్ తోపాటు డ్రైవర్ మరణించారు. కారు దిగిన ఉమేశ్ చంద్ర నక్సల్స్ ను వెంబడించారు. అయితే ఆయన వద్ద రివాల్వర్ లేదని గ్రహించిన నక్సల్స్ ఆయనను కాల్చిచంపారు.

ఈ నేపథ్యంలోనే అప్పట్లో హైదరాబాద్ ఎస్సార్ నగర్ జంక్షన్ లో ఐపీఎస్ ఉమేశ్ చంద్ర నిలువెత్తు కాంస్య విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అది ఇప్పటికీ ఉంది.

ఇక 1999లో ఉమేశ్ చంద్ర మరణించినప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎంగా చంద్రబాబు ఉన్నారు. దీంతో ఉమేశ్ చంద్ర సతీమణి చదలవాడ నాగరాణికి కారుణ్య నియామకంలో భాగంగా ఆర్డీవో (డిప్యూటీ కలెక్టర్) పోస్టును ఇచ్చారు.

1999 నుంచి నాగరాణి ఏపీలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో డైరెక్టర్ గా పనిచేస్తూ వచ్చారు. ప్రస్తుతం ఆమె సాంకేతిక విద్యా శాఖ కమీషనర్ గా ఉన్నారు. ఇప్పుడు చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండటంతో ఆమెకు కలెక్టర్ యోగం పట్టింది. నాగరాణిని తాజా ఐఏఎస్ బదిలీల్లో పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ గా నియమించారు. దీంతో ఆమె తొలిసారి కలెక్టర్ కాబోతున్నారు.

దీంతో ఎస్పీగా ఉన్నప్పుడు ఉమేశ్ చంద్ర ఎంత నిజాయితీగా పనిచేశారో.. రౌడీలను, ఫ్యాక్షనిస్టులను, నక్సలైట్లను ఎలా అణిచివేశారో ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు. అంతే నిజాయితీగా నాగరాణి కూడా కలెక్టర్ గా పేద ప్రజలకు అండగా ఉండాలని ఆశిస్తున్నారు.

## ప్రతి నాన్న ఓ చదవని పుస్తకం

ఆరుబయట నులక మంచంపై పడుకొని ఆకాశంలోకి చూస్తూ.. ప్రేమ, పెళ్లి కలల్లో విహరిస్తున్నా. కాసేపటికి చిన్నగా అలికిడి అయితే పక్కకి చూశా. ఎప్పుడొచ్చారో తెలియదు.. నా పక్కనే కూర్చుని ఏదో దీర్ఘాలోచనలో ఉన్నారు నాన్న. దిగాలుగా ఉన్న ఆయన్ని చూసి 'ఏమైంది నాన్నా?' అనడిగా. నాలుగు క్షణాలు నిట్టూర్చి.. 'ఏంటోరా.. పిల్లల్నైతే చదివించానుగానీ.. వాళ్లు మంచి ఉద్యోగంలో కుదురుకోవాలనే నా కోరిక మాత్రం తీరడం లేదు' అంటూ అటువైపు తిరిగి కన్నీటి చెమ్మను తుడుచుకుంటుంటే నా మనసు కలుక్కుమంది. ఆయన్ని అలా కూర్చోబెట్టి మెల్లగా కాళ్లు నొక్కసాగా. ఎక్కడ నా చేతులు తెగిపోతాయేమో అన్నట్టుగా ఉన్నాయి ఆ కాళ్ల పగుళ్లు. మాకోసం ఆయన ఎంత కష్టపడుతున్నా.. ఇంత బాధగా ఎప్పుడూ కనిపించలేదు. ఒక్కసారిగా గతంలోకి జారుకున్నా.

నాకు ఊహ తెలిసిన దగ్గర్నుంచి నాన్న ఏనాడూ మంచి దుస్తులు కట్టింది లేదు. మాకు మాత్రం ప్రతి పండక్కీ కొత్తవి తెచ్చేవారు. ఆయన ఎప్పుడూ కీప్యాడ్ ఫోనే వాడేవారు. మాకేమో అడిగిన స్మార్ట్‌ఫోన్ కొనిచ్చే వారు. అమ్మానాన్నలిద్దరూ తెల్లవారు జామునే లేచేవారు. ఇంట్లో పనులన్నీ చేసుకొని, రెండుమూడు ఇడ్లీలు తిని పొలానికి వెళ్లేవారు. ఏ మధ్యాహ్నానికో వచ్చి.. వీలైతే కూరతో లేదా పచ్చడి మెతుకులు తిని వెళ్లిపోయేవారు. అదీకాకుండా ఏమాత్రం ఖాళీగా ఉన్నా.. వేరే చోట పనికి వెళ్లేవారు. నాకు ఒక్కోసారి అనిపించేది.. 'డబ్బుమీద ఎందుకింత ఆశ? ఉన్నంతలో సౌకర్యవంతంగా ఉండొచ్చుగా' అని. నేను ఎప్పుడైనా నాన్నతో కలిసి బజారుకెళ్తే.. కూలీ నుంచి మోతుబరిదాకా.. అందరినీ పేరుపేరునా పలకరించేవారు. 'ఈయనకేంటి ఇంత చాదస్తం.. అందర్నీ పలకరించడం అవసరమా?' అనుకునే వాడిని. ఓసారి ఏదో పని ఉండి నేను ఒక్కడినే బయటికొచ్చా. ఒక పెద్దాయన నన్ను ఆపి నాన్న గురించి అడిగారు. 'నవ్వుని ముఖానికి అతికించుకున్నట్టు.. మీ నాన్న ఎప్పుడూ సంతోషంగానే ఉంటాడు బాబూ. పని తప్ప ఆయనకేం పట్టదు' అన్నారు. ఆ మాటలు నాకెక్కడో తగిలాయి. నాన్నకి సరదాలంటూ ఏమీ లేవు. సౌకర్యాలూ అంతంతే. విలాసాల గురించి తెలియనే తెలియదు. కోరినవన్నీ దక్కుతున్నా.. ఇంకా ఏదో వెలితి ఉందని ఆలోచించేవాణ్ని నేను. మరి ఆయనేంటి? ఏమీ లేకుండానే అన్నీ ఉన్నట్టుగా ఎందుకంత సంతోషం? గొప్పగొప్ప వ్యక్తులు, మహనీయుల గురించి నేను పుస్తకాల్లోనే చదువుకున్నా. బాగా ఆలోచించాక.. నాన్న వాళ్లకంటే ఎందులో తక్కువ అనిపించింది.

అన్నింట్లో సర్దుకుపోయి.. ప్రతిదాంట్లో సంతోషం వెతుక్కునే నాన్న కళ్లనీళ్లు పెట్టుకున్నారంటే నిజంగా ఆయన మనసు గాయపడిందనే అర్థం. దానిక్కారణం మేం ఉద్యోగాల్లో స్థిరపడక పోవడమే. ఎంతో చేసిన నాన్నకు ప్రేమతో కొంతైనా చేయాలని బాగా కష్టపడ్డా. అలుపెరుగకుండా ప్రయత్నించా. మరీ గొప్పదేం కాదుగానీ.. ఒక పేరున్న సంస్థలో చిన్న ఉద్యోగం సాధించా. మొదటి జీతం రాగానే అమ్మా నాన్నలకు కొత్త బట్టలు తీసుకున్నా. ఆ క్షణం ఆయన మనసులో ఉన్నది తెలుసుకోవాలనుకున్నా. 'నాన్నా.. మేం ఎప్పుడూ బాగుండాలనుకుంటారు. కోరినవన్నీ కొనిపెడతారు కదా.. 'నేనూ వాళ్లలా ఉంటే బాగుండు' అని ఎప్పుడైనా అనుకున్నారా?' అనడిగా. దానికాయన పెద్దగా నవ్వుతూ.. 'మీరు అందంగా కనిపిస్తే నేనూ అందంగా ఉన్నట్టేరా. మీకు సౌకర్యంగా ఉంటేనే నాకు సంతోషం నాన్నా.. మీ మంచి భవిష్యత్తే నేను సాధించే గొప్ప విజయం' అంటుంటే నా కళ్లలో నీళ్లు ఆగలేదు. రోజూ చూస్తున్న నాన్నేగా.. ఆయన గురించి మాకు అంతా తెలుసు అనుకుంటారు చాలామంది పిల్లలు. కానీ ప్రతి నాన్న మనకు తెలియని ఓ గొప్ప పుస్తకం. అప్పుడప్పుడూ చదవడానికి ప్రయత్నించండి.

# తక్కువ సమయంలో జుట్టు ఒత్తుగా, పొడవుగా



అందమైన నల్లటి జుట్టు, ప్రతి అమ్మాయికి కల. ఆడవాళ్లందరి బలహీనత జుట్టు! చాలా మంది పొడవాటి జుట్టును ఇష్టపడతారు. కానీ సమయాభావం వల్ల వెంట్రుకలను సంరక్షించుకోవడం జరగకపోవడంతో ఒత్తైన పొడవాటి జుట్టు కల కలగానే మిగిలిపోయింది. పొడవాటి జుట్టుకు అదనపు జాగ్రత్త అవసరం. కొన్ని హెూం రెమెడీస్‌ని అనుసరించడం ద్వారా మీరు మీ జుట్టును ఏ సమయంలోనైనా పొడవుగా పెంచుకోవచ్చు. ఎలాంటి నియమాలు పాటించాలో చూడండి.

**1) జుట్టు పెరుగుదలకు స్కాల్ప్ మసాజ్:** జుట్టు పెరగడానికి మరియు ఆరోగ్యంగా ఉండటానికి ఖరీదైన ఉత్పత్తులను ఉపయోగించాలని చాలా మంది అనుకుంటారు. ఇది చాలా తప్పు ఆలోచన! మార్కెట్‌లోని ఖరీదైన ఉత్పత్తులు జుట్టును బాగా ఉంచడానికి లేదా పెరగడానికి పని చేయవు! అలా కాకుండా జుట్టు పెరగాలంటే కొన్ని పద్ధతులను తెలుసుకోవాలి. చెట్టు పెరగడానికి మంచి నేల అవసరం అయినట్లే, జుట్టు ఆరోగ్యంగా ఉండకపోతే జుట్టు పెరగదు. కాబట్టి శిరోజాలు ఆరోగ్యంగా ఉండాలంటే మసాజ్ చేయడం చాలా ముఖ్యం. జుట్టు పెరుగుదలను ప్రోత్సహించడానికి సులభమైన మార్గం స్కాల్ప్ మసాజ్. ఇది మీ తలకు రక్త ప్రసరణను పెంచుతుంది, జుట్టు మూలాలను బలపరుస్తుంది. మీరు ఆయిల్ మసాజ్ చేయవచ్చు. నూనె జుట్టు పెరుగుదలకు కూడా సహాయపడుతుంది.

**2) గుడ్డుతో హెయిర్ మాస్క్:** గుడ్లలో లెసిథిన్ మరియు ప్రొటీన్లు ఉంటాయి, ఇవి జుట్టును బలపరుస్తాయి, పోషణను అందిస్తాయి మరియు దెబ్బతిన్న జుట్టును బాగు చేస్తాయి. జుట్టు బలంగా లేకుంటే ఎప్పటికీ పెరగదు. కాబట్టి జుట్టు ఆరోగ్యంగా ఉండటానికి గుడ్డు మాస్క్ గ్రేట్ గా పని చేస్తుంది.

రెండు గుడ్లు తీసుకుని వాటిని రెండు టేబుల్ స్పూన్ల ఆలివ్ ఆయిల్ కలపాలి. మిశ్రమానికి అర కప్పు నీరు కలపండి. పొడి జుట్టు మీద మాస్క్ ను అప్లై చేయాలి మరియు 30 నిమిషాలు వదిలివేయండి. తర్వాత మంచి షాంపూతో కడగాలి, అయితే కండీషనర్ వర్తించండి.

**3) మీ జుట్టును చల్లటి నీటితో కడగాలి:** వేడి నీళ్ల వల్ల జుట్టు పొడిబారేలా చేస్తుంది. కాబట్టి మీ జుట్టును ఎల్లప్పుడూ చల్లటి నీటితో కడగాలి. ఇది జుట్టును కూడా స్ట్రెయిట్ చేస్తుంది.

**4) ఆముదం:** జుట్టు పెరుగుదలకు ఆముదం మిశ్రమం. ఆముదం నూనెలో యాంటీ ఫంగల్ మరియు యాంటీ బాక్టీరియల్ లక్షణాలు ఉన్నాయి, ఇది జుట్టు రాలడానికి ప్రధాన కారణమైన స్కాల్ప్ ఇన్ఫెక్షన్‌ను నివారిస్తుంది. ఆముదం నూనెలో ఒమేగా-6 ఫ్యాటీ యాసిడ్స్, విటమిన్ ఇ, ప్రొటీన్లు మరియు జుట్టును తేమగా ఉంచే ఇతర పదార్థాలు ఉన్నాయి. ఆముదం నూనెను జుట్టు మూలాలపై మసాజ్ చేయడం వల్ల జుట్టు సులభంగా పెరుగుతుంది.

**5) జుట్టుకు ఎక్కువ వేడిని కలిగించకండి:** మనం జుట్టును ఆరబెట్టడానికి లేదా స్టైల్ చేయడానికి హెయిర్ డ్రైయర్‌లు, స్ట్రెయిట్‌నర్‌లు, రంగులను ఉపయోగిస్తాము. ఈ ఎలక్ట్రానిక్‌లను ఉపయోగించడం వల్ల జుట్టు తీవ్రంగా దెబ్బతింటుంది, జుట్టు పెరుగుదల తగ్గుతుంది.

**6) షాంపూ ఎక్కువ వద్దు:** మీరు ఎక్కువగా షాంపూ చేస్తే, మీ జుట్టు పొడిగా మరియు విరిగిపోతుంది. జుట్టు యొక్క సహజ తేమ పోతుంది. జుట్టులో పోషకాలు తగ్గిపోతే జుట్టు పెరగదు.

**7) ధూమపానానికి దూరంగా ఉండండి:** ధూమపానం ఆరోగ్యానికే కాదు జుట్టుకు కూడా హానికరం. ధూమపానం వల్ల శరీరంలో ఉత్పత్తి అయ్యే టాక్సిన్స్ జుట్టు పెరుగుదలను నిరోధిస్తాయి.

**8) ఒత్తిడి లేకుండా ఉండండి :** అధిక ఒత్తిడి వల్ల జుట్టు రాలిపోతుంది. కాబట్టి జుట్టు పెరగడానికి ఒత్తిడి లేకుండా ఉండటానికి ప్రయత్నించండి.

**9) చిక్కుపడనివ్వకండి:** జుట్టు చిక్కులు చాలా సాధారణమైనవి. కానీ ఈ చిక్కు జుట్టును డ్యామేజ్ చేస్తుంది. చిక్కు లేకుండా జుట్టును ఎప్పటికప్పుడు దువ్వండి, అది జుట్టు యొక్క మూలాలను వదులుతుంది, జుట్టు రాలడం కూడా సంభవించవచ్చు. కాబట్టి, ఎప్పటికప్పుడు చిక్కు విడిపించండి. అలాగే మీ జుట్టును ఆరబెట్టడానికి మృదువైన టవల్ ఉపయోగించండి.

**సరైన ఆహారం తీసుకోండి:** పొడవాటి, బలమైన జుట్టు కలిగి ఉండటం అనేది మీరు మీ జుట్టుపై ఉంచే ఉత్పత్తులపై మాత్రమే ఆధారపడి ఉండదుబీ ఇది మీరు మీ శరీరంలో ఉంచిన వాటిపై కూడా ఆధారపడి ఉంటుంది. "జుట్టు పెరుగుదలను ప్రోత్సహించడానికి, మీరు లోపలి నుండి జుట్టును 'ఫీడ్' చేయాలి" .అందుకు మంచి పౌష్టికాహారం తీసుకోవాలి

**సిల్క్ పిల్లోకేస్ మీద పడుకోండి:** రాత్రిపూట మెరుగైన జుట్టును పొందడం సాధ్యమవుతుంది - మీకు కావలసిందల్లా మీ పిల్లోకేస్‌ని మార్చడం మరియు పట్టు యొక్క జుట్టు-ఆరోగ్యకరమైన ప్రయోజనాలను పొందడం. "వెంట్రుకలపై పట్టు తేలికగా ఉంటుంది - చిక్కులు మరియు విరిగిపోకుండా ఇది సహాయపడుతుంది".

# మీరు ఒత్తిడితో పోరాడుతున్నారా?



మీరు ముఖ్యమైన పనులు, పనికి ప్రాధాన్యత ఇవ్వాలనేది నిజమే అయినప్పటికీ, మీ స్నేహితులు, కుటుంబ సభ్యులతో ఎక్కువ సమయం గడపడం కూడా అంతే ముఖ్యం. సరైన షెడ్యూల్‌ను రూపొందించుకోవడం కూడా సాధ్యమవుతుంది. కానీ ఆచరణాత్మకంగా ఉండటం ముఖ్యం. మీరు చాలా ముఖ్యమైనవిగా భావించే పనులకు రోజులో ఎక్కువ సమయం ఇవ్వండి. ఇంట్లో గడుపుతూ ఆఫీసు పనులు చెడిపోతాయనే ఆలోచనలో కూరుకుపోకండి.

జీవితంలో ఆరోగ్యం కంటే పనికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తాం. విజయం సాధించడానికి, మనం నిరంతరం ఒత్తిడి సంకెళ్లలో కొట్టుమిట్టాడుతున్నాము. పని నుంచి ఒత్తిడి తగ్గించడం మీ శరీరానికి, మనస్సుకు మంచిది. పని చేసే వ్యక్తి తన వ్యక్తిగత జీవితంలోని డిమాండ్లకు సమాన ప్రాధాన్యత ఇస్తాడు. వర్క్ ప్లేస్ లో బాధ్యతలు పెరగడం, ఎక్కువ గంటలు పని చేయడం, ఇంట్లో బాధ్యతలను ఎదుర్కోవడం వంటి సమస్యలు ఎదురవుతాయి. మీరు ముఖ్యమైన పనులు, పనికి ప్రాధాన్యత ఇవ్వాలనేది నిజమే అయినప్పటికీ, మీ స్నేహితులు, కుటుంబ సభ్యులతో ఎక్కువ సమయం గడపడం కూడా అంతే ముఖ్యం. సరైన షెడ్యూల్‌ను రూపొందించుకోవడం కూడా సాధ్యమవుతుంది. కానీ ఆచరణాత్మకంగా ఉండటం ముఖ్యం. మీరు చాలా ముఖ్యమైనవిగా భావించే పనులకు రోజులో ఎక్కువ సమయం ఇవ్వండి. ఇంట్లో గడుపుతూ ఆఫీసు పనులు చెడిపోతాయనే ఆలోచనలో కూరుకుపోకండి.

మీరు ఎంచుకున్న కెరీర్‌లో ఎలాంటి అడ్డంకులు ఉండకూడదు. మీరు చేస్తున్న పనితో మీరు సంతృప్తి చెందకపోతే మీరు ఒత్తిడిలో ఉన్నారని అర్థం. మీరు మీ ఉద్యోగంలోని ప్రతి అంశాన్ని ప్రేమించాల్సిన అవసరం లేదు. అయితే పని పట్ల ఆసక్తి ఉండాలి. మీరు ప్రతిరోజూ ఉదయం మంచం మీద నుండి లేచినప్పుడు, మీ పని గురించి సానుకూలంగా ఆలోచించండి. మీరు అలసిపోయి, మీకు నచ్చిన పనులు చేయడం కష్టంగా అనిపిస్తే ఏదో తప్పు జరిగిందని అర్థం. నచ్చని వాతావరణంలో పనిచేయడం చాలా కష్టం. మీరు మీ ఉద్యోగానికి భయపడితే, ఇప్పుడు మీకు నచ్చిన ఉద్యోగం కోసం వెతకడం ప్రారంభించండి.

ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వండి. మానసిక ఆరోగ్యం, భావోద్వేగ ఆరోగ్యం, శారీరక దృఢత్వం అంటే మొత్తం ఆరోగ్యానికి శ్రద్ధ వహించండి. మీరు డిప్రెషన్‌లో ఉండి పనిని కొనసాగించడం మంచి పరిణామం కాదు. తీవ్రమైన వెన్నునొప్పి ఉన్నప్పటికీ మీరు పని చేస్తుంటే, త్వరలో మీరు ఆరోగ్య కారణాల వల్ల పనిని వదిలివేయవలసి ఉంటుంది. మీరు ఏదైనా దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతుంటే బాగా చికిత్స పొందండి. ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించండి.

ఎప్పటికప్పుడు బయటి ప్రపంచం నుంచి డిస్‌కనెక్ట్ చేయడం వల్ల వారం ఒత్తిడి నుంచి కోలుకోవచ్చు. ఇది ఇతర ఆలోచనలతో ముందుకు రావడానికి మాకు అవకాశం ఇస్తుంది. పని ఇమెయిల్‌ను తనిఖీ చేయడానికి బదులుగా ధ్యానం చేయడానికి కొన్ని క్షణాలను అన్‌ప్లగ్ చేయడం ఉత్తమం. మీరు పని కోసం ప్రయాణాలు చేస్తుంటే కొన్ని మంచి పుస్తకాలు చదవండి. ఇది పని ఒత్తిడిని తగ్గిస్తుంది. విరామం తీసుకోండి. కొన్నిసార్లు అన్‌ప్లగ్ చేయడం అంటే సెలవు తీసుకోవడం. ఈ సమయంలో ఆఫీసు పనిని పూర్తిగా ఆపివేయండి. సెలవుల్లో ప్రయాణం మిమ్మల్ని శారీరకంగా, మానసికంగా రిఫ్రెష్ చేస్తుంది. ఈ సమయంలో ఆఫీస్ మెయిల్, ఆఫీస్ వాట్సాప్ గ్రూపులను చెక్ చేయడం, రిప్లై ఇవ్వడం మానేయండి. దీంతో మళ్లీ పనిలోకి వచ్చాక రెట్టింపు ఉత్సాహంతో, శక్తితో పని చేయగలుగుతారు.

# దానిమ్మ తొక్కలను ఎండబెట్టి ఉపయోగిస్తే అద్భుత ఆరోగ్య ప్రయోజనాలు



దానిమ్మ తొక్కలు తీసాక చాలామంది వాటిని పడేస్తుంటారు. అయితే అవి ఆయుర్వేద వైద్యంలో వివిధ ఆరోగ్య-సౌందర్య ప్రయోజనాల కోసం క్రమం తప్పకుండా ఉపయోగించబడుతున్నాయి. దానిమ్మ తొక్కలుతో కలిగే ప్రయోజనాలు ఏమిటో తెలుసుకుందాము. దానిమ్మ రసం కంటే దానిమ్మ తొక్కలులో 50 శాతం ఎక్కువ యాంటీఆక్సిడెంట్లను కలిగి ఉంటాయి. దానిమ్మ తొక్కలను తీసి 2 లేదా 3 రోజులు నేరుగా సూర్యకాంతి ఉన్న కిటికీ దగ్గర ఉంచండి.

ఎండిన దానిమ్మ తొక్కలను బ్లెండర్ లేదా ఫుడ్ ప్రాసెసర్‌లో వేసి మెత్తగా మెత్తగా రుబ్బుకోవాలి. ఈ దానిమ్మ పొడిని గది ఉష్ణోగ్రత వద్ద గాలి చొరబడని కంటైనర్‌లో నిల్వ చేసుకోవాలి. ఈ దానిమ్మ పొడి కొన్ని చర్మ పరిస్థితులకు చికిత్స చేయడంలో సహాయపడుతుంది.

దానిమ్మ తొక్కలు గుండె జబ్బులు-మధుమేహం వంటి దీర్ఘకాలిక సమస్యలను అడ్డుకుంటాయి.

దానిమ్మ తొక్కల చూర్ణంతో మెదడు పనితీరును మెరుగుపరచవచ్చు. దానిమ్మ తొక్కలలో పునికాలాగిన్ అనే పాలీఫెనాల్ అధిక మొత్తంలో ఉంటుంది, ఇది క్యాన్సర్ నిరోధక లక్షణాలను కలిగి ఉంది. దంత ఆరోగ్యాన్ని, గొంతు నొప్పిని తగ్గించడానికి, రుమటాయిడ్ ఆర్థరైటిస్ చికిత్సకు దానిమ్మ తొక్కలు సహాయపడుతాయి.

# అత్తిపండ్లను తింటే కిడ్నీలో రాళ్లు ఏర్పడతాయా?



అత్తిపండ్లు ఆరోగ్యానికి మంచివే. కానీ అతి సర్వత్రా వర్జయేత్ అన్నట్లుగా అత్తి పండ్లను ఎక్కువగా తీసుకోవడం ఏ మాత్రం మంచిది కాదు. వీటిని అతిగా తీసుకోవడం వల్ల కిడ్నీలో రాళ్లు ఏర్పడతాయని నిపుణులు అంటున్నారు. వీటిని తినడం వల్ల శరీరంలో ఆక్సలేట్ పరిమాణం పెరుగుతుంది. ఫలితంగా కిడ్నీలో రాళ్లు ఏర్పడే అవకాశం పెరుగుతుంది.

అలాగే అత్తిపండ్లను అధికంగా తీసుకోవడం వల్ల మైగ్రేన్ సమస్య ఎదురవుతుంది. ఎండిన అత్తి పండ్లలో సల్ఫేట్ పరిమాణం ఎక్కువగా ఉంటుంది. ఇలా సల్ఫైడ్ అధికంగా ఉండే ఆహారాలను ఎక్కువగా తినడం మైగ్రేన్ కలుగుతుందని నిపుణులు చెబుతున్నారు.

ఈ అత్తిపండ్లను అతిగా తింటే కడుపు నొప్పి సమస్య కూడా రావచ్చు. ఎక్కువ మొత్తంలో అత్తిపండ్లను తింటే జీర్ణవ్యవస్థపై చెడు ప్రభావం పడి, కడుపునొప్పి వస్తుంది. ఈ క్రమంలోనే మీకు అజీర్తి, మలబద్ధకం, గ్యాస్ సమస్యలు కూడా ఎదురవుతాయి.

అత్తి పండ్లను ఎక్కువగా తినడం దంతాలకు కూడా హానికరం. ఈ క్రమంలో మీ దంతాలు పుచ్చిపోతాయి. అత్తిపండ్లలో అధికంగా ఉండే చక్కెర పంటి నొప్పి, దంత క్షయం వంటి సమస్యలను దారి తీస్తుంది.

అత్తిపండ్లు మధుమేహంతో బాధపడేవారి ఆరోగ్యానికి మంచివే. కానీ పరిమితి దాటి తింటే రక్తంలో షుగర్ లెవెల్స్‌ని పెంచుతాయి. ఈ కారణంగా అత్తిపండ్లను పరిమితిగా తీసుకోవడమే ఆరోగ్యానికి ఎంతో మంచింది.

# స్త్రీలు ఎండుద్రాక్ష తింటే ఏమవుతుంది?



ఎండు ద్రాక్ష. ఇవి కొంతవరకు తీపి రుచి ఉన్నప్పటికీ తక్కువ కొవ్వు ఉంటుంది. కేలరీలు తక్కువగా ఉంటాయి. దాదాపు కొవ్వు రహితంగా ఉంటాయి. ఎండు ద్రాక్ష ఇతర ఆరోగ్య ప్రయోజనాలు తెలుసుకుందాము. ఎండు ద్రాక్షలో ఒలెనిక్ అయాసిడ్ ఉన్నందున దంతా లలో ఉన్న బ్యాక్టీరియాను పెరగనివ్వ కుండా పళ్ళను రక్షిస్తుంది. ఎండుద్రాక్షలో ఫైబర్ పుష్కలంగా ఉన్నందున విరేచనం సాఫీగా జరుగుతుంది. స్త్రీలు ఎండుద్రాక్ష తీసుకోవడం వలన ఐరన్, విటమిన్ బి కాంప్లెక్స్ అందుతాయి. దీని వలన బ్లడ్ కౌంట్ త్వరగా పెరిగే అవకాశం ఉంది.

ఎండుద్రాక్షలో ఉండే పోలిఫినోలిక్ యాంటీ ఆక్సిడెంట్స్ క్యాన్సర్ రాకుండా కాపాడుతాయి. ఎండుద్రాక్షలో ఎసిడిటిని తగ్గించే పొటాషియం, మెగ్నీషియం అధికంగా ఉంటుంది. ఎండు ద్రాక్ష తినడం వలన శరీరంలో రక్త కణాలు, హిమోగ్లోబిన్‌ల శాతం పెరిగేలా చేస్తాయి. ఎండుద్రాక్షలో ఉండే పోషకాలు మెదడు, గుండె, నరాలు, ఎముకలు, కాలేయం చక్కగా పనిచేసేలా చేస్తాయి.

# లాభాలు కలిగించే బ్లాక్ వాటర్




సినీ తారల సీక్రెట్ బ్లాక్ వాటర్! ప్రయోజనాలు తెలిస్తే అస్సలు విడిచిపెట్టరు. బ్లాక్ వాటర్. ఈ పేరు వింటేనే చాలామందికి వికారం, వాంతులు వచ్చేలా ఉంది. ఎందుకంటే తెల్లటి, స్వచ్ఛమైన నీటినే మనం ఎక్కువగా ఇష్టపడతాం. అలాంటి స్వచ్ఛమైన నీటికోసం డబ్బు ఖర్చుపెట్టి మరీ మార్కెట్‌లో కొనుగోలు చేస్తుంటారు. కానీ, ఇక్కడ మాత్రం నల్లగా, కషాయం కంటే దారుణంగా కనిపిస్తున్న ఈ బ్లాక్ వాటర్‌ని సినీ, క్రీడా ప్రముఖులు కొందరు ఎగబడి తాగుతున్నారట. అవును, ఈ మాట నిజమే. ఎందుకంటే ఇలాంటి బ్లాక్ వాటర్‌లో అద్భుత ఆరోగ్య ప్రయోజనాలు దాగి ఉన్నాయంటున్నారు.

బ్లాక్ వాటర్ ప్రయోజనాలు సాధారణ మనం తాగే మంచినీళ్లలో ph స్థాయి 7 ఉంటే ఈ బ్లాక్ వాటర్‌లో అంతకుమించి ఉంటుందట. అలానే బాడీని హైడ్రేటెడ్, ఫిట్‌గా ఉంచటంలో ఈ బ్లాక్ వాటర్ మెరుగ్గా పనిచేస్తుంది. ఇందులో ఉండే 70% ఖనిజాలు శరీరంలో రోగ నిరోధక శక్తిని పెంచడంతో పాటు జీర్ణ ప్రక్రియని మెరుగుపరుస్తుంది. శరీరానికి సరిపడా ఈ నీరు తీసుకోవడం వల్ల మలబద్ధకం, అజీర్ణం, జీర్ణశయాంతర ప్రేగు సమస్యలను నివారిస్తుంది.

బ్లాక్ వాటర్‌ని ఎక్కువగా తీసుకోవడం వల్ల చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. చర్మం పొడిబారకుండా చేస్తుంది. జుట్టు రాలడాన్ని తగ్గిస్తుంది. మెదడు పని తీరును మెరుగుపరచడంలో ఈ బ్లాక్ వాటర్ సహాయపడుతుందని చాలా అధ్యయనాలు చెబుతున్నాయి. ఈ నీరు ఏకాగ్రతను పెంచుతుంది, మానసిక స్థితిని మెరుగుపరుస్తుంది.

వేసవిలో ఈ నీటిని ఎక్కువగా తీసుకుంటే సన్‌స్ట్రోక్ నుంచి బయటపడవచ్చు. బ్లాక్ వాటర్ శరీర వేడిని తగ్గిస్తుంది. బ్లాక్ వాటర్ రక్తపోటును అదుపులో ఉంచడం, కీళ్లలో జిగురు పెంచడంలోనూ శరీర కీలకమైన విధుల్లో పాల్గొంటుంది. జీవక్రియ, నాడీ సంబంధిత విధులను మారుస్తుంది.

మనం రోజూ తీసుకునే నీటిలో సాధారణంగా అకర్బన లవణాలు ఉంటాయి. అయితే బ్లాక్ వాటర్‌లో నీరు ఎక్కువ ఆల్కలీన్‌గా ఉంటుంది. అందువల్ల బ్లాక్ వాటర్‌ని తాగడం వల్ల చాలా ప్రయోజనాలు కలుగుతాయని వైద్యులు చెబుతున్నారు.

అందుకే, పలువురు హీరోయిన్లు మలైకా అరోరా, ఊర్వశి రౌతేలా, శ్రుతి హాసన్ తదితరులు కూడా ఈ బ్లాక్ వాటర్‌ని తాగుతున్నారట. భారత్‌లో విరాట్ కోహ్లీతో పాటు ప్రస్తుతం బ్లాక్ వాటర్ తాగుతున్న జాబితా కూడా గత కొన్ని నెలల నుంచి క్రమంగా పెరుగుతున్నట్లు తెలుస్తోంది.

# మగవారి కంటే ఆడవారికే ఎందుకు మైగ్రేన్ ఎక్కువ వస్తుంది?



మైగ్రేన్ అంటే కుడి లేదా ఎడమవైపు తలనొప్పి రావడం. ఒక్కోసారి దీని కారణంగా తలలో నరాలు బలహీనపడి ఆలోచనాశక్తి తగ్గిపోతుంటుంది. స్త్రీ, పురుషులు ఇద్దరిలోనూ మైగ్రేన్ బాధితులున్నారు. కానీ పురుషుల్లో కంటే స్త్రీలలోనే మైగ్రేన్‌తో బాధపడుతున్నవారు అధికంగా ఉంటున్నారు. అందుకు కారణం ఇంటి పని, ఆఫీస్ పని ఒత్తిడి, సమయానికి ఆహారం సరిగ్గా తీసుకోకపోవడం, తీసుకునే ఆహారంలో సరైన పోషకాలు లేకపోవడమేనని వైద్యులు చెబుతున్నారు. వాటికి తోడు ఎన్నో రకాల ఆలోచనలు, చిన్నచిన్న విషయాలకే ఆందోళన చెందడం కూడా మైగ్రేన్ కు కారణాలు. వీలైనంత వరకూ ప్రశాంతంగా ఉండేందుకు ప్రయత్నించాలి. అప్పుడే మెదడుపై ఒత్తిడి పడకుండా.. మైగ్రేన్ కు గురికాకుండా ఉంటారు

సాధారణంగా తలనొప్పి వస్తేనే తట్టుకోలేం. వెంటనే దానికి సంబంధించిన ట్యాబ్లెట్ వేసుకుని రెస్ట్ తీసుకుంటాం. లేదంటే ఒక టీ లేదా కాఫీ తాగుతాం. నిజానికి టీ, కాఫీల వల్ల తలనొప్పి తగ్గదు. వాటిలో ఉండే కెఫీన్ కారణంగా మనం కొంత ప్రశాంతంగా ఉండగలుగుతాం. తలనొప్పినే భరించలేం కదాం. మరి మైగ్రేన్ పెయిన్ వస్తే? అది ఇంకా తీవ్రంగా ఉంటుంది. కనీసం రోజువారి పనులు కూడా చేసుకోలేనంత అవస్థ పెడుతుంది మైగ్రేన్. శరీరంలో విటమిన్ బి లోపం కారణంగా మైగ్రేన్ వస్తుంది.

మన శరీరంలో మెటబాలిజం ప్రక్రియలో విటమిన్ బి ముఖ్యపాత్ర పోషిస్తుంది. కార్బోహైడ్రేట్లు, కొవ్వుల నుంచి శక్తిని ఉత్పత్తి చేయడం, ఆ శక్తిని శరీర అవయవాలు వినియోగించుకోవడానికి విటమిన్ బి పనిచేస్తుంది. నిద్రలేమి, ఒత్తిడి, సరైన ఆహారం తీసుకోకపోవడం, అలసట కారణంగా నరాల వ్యవస్థపై వాటి ప్రభావం పడి తరచూ తలనొప్పి వస్తుంది. క్రమంగా అది మైగ్రేన్‌కు దారితీస్తుంది. ఒక్కోసారి ఇది పక్ష వాతానికి కూడా దారి తీయచ్చు. దీనిన స్పైనల్ కార్డ్ సబ్ అక్యూట్ కంబైన్డ్ డిజనరేషన్ అంటారు.

విటమిన్ బి లోపాన్ని నివారించగలిగితే, మైగ్రేన్ నుండి విముక్తి పొందవచ్చు. థయామిన్ (విటమిన్ బి1), రైబోఫ్లావిన్ (విటమిన్ బి2) సరైన మోతాదులో శరీరానికి అందని పక్షంలో మైగ్రేన్ వస్తుంది. శరీరానికి విటమిన్ బి1 అందాలంటే బఠానీ, హెూల్ వీట్ బ్రెడ్, నట్స్ వంటివి ఆహారంగా తీసుకోవాలి. అలాగే విటమిన్ బి కోసం పాలు, గుడ్లు, పెరుగు ఎక్కువగా తీసుకుంటూ ఉండాలి. అలాగే లివర్, మష్రూమ్స్, మాంసం, చేపలు, తాజా అరటి పండ్లు, కమలా పండ్లలో థయామిన్ (విటమిన్ బి1) ఎక్కువగా లభిస్తుంది. రైబోఫ్లావిన్ (విటమిన్ బి2) పాలు, గుడ్లతో పాటు పుట్టగొడుగుల్లో ఎక్కువగా లభిస్తుంది.

# అద్వితీయం సురభి నాటక కుటుంబీకుల కళా నైపుణ్యం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** సురభి నాటక కుటుంబీకుల కళా నైపుణ్యం అద్వితీయమని ఆంధ్ర విశ్వ కళాపరిషత్ రంగస్థల విభాగం అధ్యాపకులు డాక్టర్ మీగడ శశిభూషణ స్వామి పేర్కొన్నారు. వీరు ప్రదర్శించిన భుకైలాస్ పౌరాణిక పద్య నాటకం అనన్య మనోరంజకంగా ఉందని అన్నారు.

శ్రీ భానోదయ నాట్య మండలి ( సురభి) హైదరాబాద్ సభ్యులు సురభి 140వ వార్షికోత్సవం సందర్భంగా విశాఖ పట్నం కళాభారతి ప్రాంగణంలో భూకైలాస్ నాటకం ప్రదర్శించింది. రంగశాయి నాటక సంఘం బాధంగీర్ సాయి కళా భారతి సహకారంతో రంగశాయి మీడియా ద్వారా ఏర్పాటు చేసిన సురభి కుటుంబీకుల ఈ నాటక ప్రదర్శన సభా కార్యక్రమం లో ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ శశి భూషణ్ స్వామి మాట్లాడుతూ నాటక రంగం పరిరక్షణలో బాదంగీర్ సాయి ప్రయత్నం నిత్య ఆదర్శనీయం అన్నారు. ఈ ప్రదర్శనలలో ఎన్ ఎన్ ఆర్ సమర్ధనిర్వహణ హర్షణీయం అన్నారు. మీడియా సహకారంతో ప్రేక్షక దేవుళ్ళ ఆదరణతో సురభి కుటుంబీకుల అనుబంధంతో సాయి ఈ ప్రదర్శనలు ఏర్పాటు చేయగలిగానన్నారు. కళాభారతి యాజమాన్యం ప్రేక్షక దేవుళ్ళ ప్రోద్బలం ముందుకు నడిపిస్తుందన్నారు. మాస్టర్ ఆఫ్ షర్మని గా నాగనబోయిన నాగేశ్వర రావు ( ఎన్ ఎన్ ఆర్ ) వ్యవహరించిన సభా కార్యక్రమంలో

ఆత్మీయ అతిథులు గా ఆంధ్ర విశాఖ రచయితల సంఘం కార్యదర్శి అడపా రామకృష్ణ, కళాభినయ వ్యవస్థాపకులు కవి ప్రసాద్, నంది అవార్డు గ్రహీత దేవిద్రాజు, సహృది సాహితీ ప్రధాన కార్యదర్శి సిహెచ్. చిన్న సూర్యనారాయణ, హాస్య ప్రియ కామెడీ క్లబ్ కార్యదర్శి ఇమంది ఈశ్వరరావు, జ్యోతి సరళ నాటక పరిషత్తు అధ్యక్షులు రామారావు, సాయి కళానికేతన్ గౌరవ అధ్యక్షులు గంటా అప్పలనాయుడు, రంగస్థలం నటి సంధ్యా ప్రియదర్శిని, శివ జ్యోతి, శ్రీమతి బాదంగీర్ సాయి, వరె నాంచారయ్య, హెచ్ పి సి ఎల్ పూర్వ అధికారి శర్మ తదితరులు పాల్గొన్నారు.

**భూకైలాస్ నాటక కథాంశం**

రాక్షస రాజు రావణుడు ఇంద్రుని స్వర్గపు రాజ్యం యొక్క రాజధాని అమరావతిని ఆక్రమించాలని నిర్ణయించు కున్నాడు. రావణుడి ప్రణాళికలకు భయపడిన ఇంద్రుడు నారదుని సహాయం కోరతాడు.

రావణుడి తల్లి కైకసి చేసే పూజల వల్ల రావణుడికి బలం వస్తుందని నారదుడు ఇంద్రుడికి తెలియజేసాడు. శివుని ఇసుక శిల్ప ప్రాతినిధ్యమైన సైకత లింగానికి రావణుడి తల్లి పూజను ఇంద్రుడు విధ్వంసం చేయాలని అతను సూచిస్తున్నాడు.

రావణుడు తపస్సు చేసి శివుని ఆత్మలింగాన్ని తన తల్లి కోసం తీసుకురావాలని నిర్ణయించుకున్నాడు. రావణుని కోరికను తీర్చడానికి శివుడు రావణునికి కనిపించినప్పుడు, విష్ణువు రావణుడి మనస్సును తారుమారు చేసి, పార్వతీ దేవిని కోరుకునేలా చేస్తాడు. రావణుడు పార్వతి దేవితో ఇంటికి వెళుతుండగా, నారదుడు అతనిని మార్గ మధ్యంలో కలుసుకున్నాడు. అతని సహచరుడు భూతమును చూపించి పార్వతి అని చెబుతాడు. కుయుక్తితో విసిగిపోయిన రావణుడు తిరిగి కైలాసం చేసుకొని శివునిని ప్రశ్నిస్తాడు. శివుని ప్రశ్నించి మరల తపస్సు చేసి వరమును పొందుతాను అని అక్కడినుండి వెళ్ళిపోతాడు. ఇంతలో పార్వతి దేవి కైలాసానికి వస్తుంది.

నారదుడి నుండి ప్రణాళికలను విని, శివుని సతీమణి అయిన పార్వతి దేవి విష్ణువును శపిస్తుంది. రావణుడు తిరుగు ప్రయాణంలో పాతాళ యువరాణి మండోదరిని కలుస్తాడు. ఆమె నిజమైన పార్వతి దేవి అని నమ్మి, ఆమెను వివాహం చేసుకున్నాడు. చివరికి, అతను ఏమి జరిగిందో గ్రహించి, మరల తపస్సు చేసి శివుని దర్శించుకుంటాడు. క్షమించమని శివుడిని వేడుకున్నాడు. పరమశివుడు రావణుడికి ఆత్మలింగాన్ని అందజేసి, ఆత్మలింగం ఎప్పుడైనా భూమిని తాకితే, అది మళ్లీ కదలదని హెచ్చరించాడు. నారదుడు వినాయకుడిని ప్రేరేపిస్తూ రావణుడిని మోసగించి ఆత్మ లింగాన్ని నేలమట్టం చేశాడు.

**పాత్రలూ పాత్రధారులు**

రావణాసురుడు - మోహన్ కృష్ణ, నారదుడు - భానుజ, కైకసి - హరిణి , మహా విష్ణువు - హరి శివ కృష్ణ, శంకరుడు - నాగబాబు, పార్వతి - ప్రసూన, మండోదరి - శ్రీదేవి, మయుడు - పూర్ణేషు, విరూపాక్షుడు - మాధవ రావు, విసాలాక్షుడు - భాను ప్రసాద్, వినాయకుడు - ధర్మేంద్ర, సుబ్రమణ్య స్వామి - రవళి, మాయ వినాయకుడు - తనూజ, చెలి కతెలు - హాసిని వీణ ఉషా సాయి సంతోషి సులోచన పుష్పలత, భక్తులు - హాసిని వీణ ఉషా సాయి సంతోషి సులోచన పుష్పలత, రాక్షసులు - ప్రభాస్ గోపీచంద్ యోగేష్, భక్తులు - జ్యోతి, ప్రమధగణాలను - నవరస థియేటర్ ఆర్ట్సుఅసోసియేషన్ నటీ నటులు పాల్గొన్నారు.

## ఘనంగా సుందరపు సతీష్ జన్మదిన వేడుకలు



**యలమంచిలి, (విశాఖ సమాచారమ్):** జనసేన ఉత్తరాంధ్ర అధికార ప్రతినిధి సుందరపు సతీష్ జన్మదిన వేడుకలు బుధవారం జనసేన కార్యాలయంలో ఘనంగా నిర్వహిం చారు. జనసేన పట్టణ అధ్యక్షుడు బొద్దపు శ్రీను కేక్ కట్ చేసి కార్యకర్తలకు జనసేన అభిమానులకు స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన సీనియర్ నాయకులు కొటారు నరేష్, ఊటకుటి రమేష్, ఇత్నం శెట్టి సన్యాసినాయుడు, పల్లా సత్యనారాయణ, లవుడు లోవ రాజు,పిట్టా శీను, కూటమి నాయకులు పండూరి శ్రీను, కొశారి సాంబశివరావు, ఆడారి రమణబాబు, కర్ణం రవి, తదితరులు పాల్గొన్నారు.

## మనిషి అవివేకి

మనిషి అవివేకి అనేదానికి నిదర్శనం ఏమిటంటే వేడిగా ఉన్నపుడు చల్లదనం కావాలంటాడు, చల్లగా ఉన్నపుడు వెచ్చదనం కావాలంటాడు.

ఎల్లప్పుడూ లేనిది కావాలనుకోవడం మనిషి చేసే పని, ప్రకృతి మనకి ఏది ఇచ్చిన ఇలా ఎందుకు వ్యతిరేకిస్తున్నాం.

నేను బాగా చలిగా ఉండే హిమాలయాల్లో మంచులో తక్కువ వస్త్రాల్లో ఉన్నాను, నాకు ఏవిధమైన సమస్య రాలేదు.

దీనికి కారణం, నేను వేరు, వాతావరణం వేరు అని నేను ఎప్పుడూ అనుకోలేదు, నేను ప్రకృతిలో ఒకడిని అనే భావన నాలో ఎప్పుడూ ఉండేది.

మీరు వేరు వాతావరణం వేరు అని మీరు అను కున్నపుడు మీరు దాన్ని నిరోధించటం మొదలుపెడతారు, ఏక్షణమైతే నిరోధించటం మొదలుపెడతారో మీకు నరకం కనిపిస్తుంది.

## అమల్లోకి వచ్చిన కొత్త క్రిమినల్ చట్టాలు

150 ఏళ్ల తర్వాత మారిన బ్రిటీష్ కాలం నుంచి అమల్లో ఉన్న చట్టాలు

ఇండియన్ పీనల్ కోడ్-ఐపీసీ స్థానంలో భారతీయ న్యాయ సంహిత-బిఎన్ఎస్

క్రిమినల్ ప్రొసీజర్ కోడ్-సిఆర్‌పిసి స్థానంలో భారతీయ నాగరిక్ సురక్ష సంహిత-బిఎన్ఎస్ఎస్

ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్-ఐఈఏ స్థానంలో భారతీయ సాక్ష్య అధినియం-బిఎస్ఎ చట్టాలు

భారతీయ న్యాయ సంహిత చట్టంలో రాజద్రోహం స్థానంలో దేశద్రోహం పదం

ఎవరైన అరెస్టయితే 14రోజుల్లోపు మాత్రమే కస్టడీ కోరే ఛాన్స్

40రోజులల్లో తీర్పు, 60 రోజుల్లో అభియోగాలు నమోదు

ఏడేళ్లకు పైగా శిక్ష పడే ఛాన్స్

ఫోరెన్సిక్ నిపుణులచే ఆధారాలు సేకరించాలి

3 నుంచి 7ఏళ్లలోపు శిక్ష పడే కేసుల్లో ఫిర్యాదు

24 గంటల్లోనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి

14 రోజుల్లోనే ఈ కేసును కొలిక్కి తేవాలి

అత్యాచార బాధితుల వాంగ్మూలాన్ని మహిళా పోలీసు అధికారి నమోదు చేయాలి

ఆ బాధితురాలి వైద్య నివేదికలు ఏడు రోజుల్లోనే సిద్ధం చేయాలి

పిల్లలను కొనడం, అమ్మడాన్ని కూడా కొత్త చట్టాల ప్రకారం తీవ్రమైన నేరం

మైనర్‌పై సామూహిక అత్యాచారం చేస్తే జీవిత ఖైదు లేదా మరణశిక్ష

చరాస్తులను, స్థిరాస్తులను పోలీసులు స్వాధీనం చేసుకునే అధికారం

మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల్లో దర్యాప్తును 2 నెలల్లో పూర్తి చేయాలి

బాధితుల వాంగ్మూలాన్ని మహిళా మేజిస్ట్రేట్ ఎదుట నమోదు చేయాలి

మహిళా సిబ్బంది సమక్షంలో పురుష మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచాలి

అత్యాచార కేసుల్లో బాధితురాలి వాంగ్మూలాన్ని ఆడియో, వీడియోల ద్వారా కేసు

పోక్సో కేసుల్లో మాత్రం బాధితురాళ్ల వాంగ్మూలాలు పోలీసులే కాకుండా మహిళా ప్రభుత్వ అధికారి ఎవరైనా నమోదు చేయవచ్చు

క్రైం అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ సిస్టం -సిసిటిఎన్ఎస్

దేశవ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల అనుసంధానం

డిజి లాకర్‌ను ఇంటర్ ఆపరబుల్ క్రిమినల్ జస్టిస్ సిస్టం-ఐసిజెఎస్‌కు అనుసంధానం

ఆధారాలు ఎవరూ కూడా మాయం చేయలేని వ్యవస్థ రూపకల్పన

అనుమానాస్పద వస్తువులు జప్తు చేసినప్పుడు 48గంటల్లో కోర్టులో సమర్పించాలి

బాధితులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లకుండానే ఆన్‌లైన్‌లో ఫిర్యాదు

ఫిర్యాదుపై పోలీసులు 3రోజుల్లోగా ఫిర్యాదుదారుల సంతకాల సేకరణ

మహిళలు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారు, దివ్యాంగులు,15 ఏళ్ల లోపు పిల్లలు, 60 ఏళ్లు దాటిన వారు పోలీస్ స్టేషన్ కు వెళ్లాల్సిన అవసరం లేదు తాము ఉండే చోటే పోలీసుల సాయం

దర్యాప్తు, న్యాయవిచారణ సమన్లు ఎస్ఎంఎస్ ద్వారా జారీ

గెజిటెడ్ అధికారి సమక్షంలో వీడియో ద్వారా సాక్ష్యం

బాధితులకు, నిందుతులకు ఎఫ్ఐఆర్ కాపీ ఫ్రీ

పోలీస్ రిపోర్ట్, ఛార్జిషీట్, స్టేట్‌మెంట్లు, ఇతర డాక్యుమెంట్ల 2వారాల్లో పొందే ఛాన్స్.

# రాష్ట్రానికి ప్రత్యేక హెూదా అడగడానికి చంద్ర బాబు నాయుడుకు ఇదే సమయం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** రాష్ట్రానికి ప్రత్యేక హెూదా అడగడానికి సీఎం చంద్ర బాబు నాయుడుకు ఇదే సరైన మంచి సమయమని, బిజెపి కేంద్ర ప్రభుత్వాన్ని మెడలు వంచి ప్రత్యేక హెూదా సాధించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ అన్నారు.

మురళీనగర్ మెయిన్ రోడ్డు ఆహ్వాన ఫంక్షన్ హాలులో సిపిఐ రాష్ట్ర సమితి సమావేశాల్లో భాగంగా బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు.

గత ఐదేళ్లలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రములో అంబాని, అదానీ కి ఎంత దోచు పెట్టారో శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర స్థాయి సభల్లో చర్చించిన అంశాలు మీద జాతీయ స్థాయిలో జరిగే సభల్లో చర్చిస్తామన్నారు. ప్రజలు సమస్యలు మీద ప్రజా పోరాటాల చేసేది వామ పక్షాలు మాత్రమేనన్నారు. స్టీల్ ప్లాంట్ ఆస్తుల అమ్మకం సరికాదన్నారు. ప్రైవేటీకరణలో భాగమే ఇదన్నారు. భూములు అమ్మకం సరికాదన్నారు. స్టీల్ ప్లాంట్ నిర్వీర్యం చేస్తున్నారని,త్వరలో అమ్మడానికి కేంద్రం ఇలా చేస్తుందన్నారు. వాలంటీర్లు చలో విజయవాడ కి ప్రభుత్వం పోలీసులు అనుమతి అనుమతి లేదని చెప్పడం మీద, త్వరలో చర్చిస్తామని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఈవీఎంల మీద ప్రశ్నించగా, దీని మీద చర్చ జరగాలన్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో ఏపి లో రూ. 10 వేల కోట్ల ఖర్చు చేశారని, దీని మీద ఎన్నికల సంఘం దృష్టి సారించాలని కోరారు. నితీశ్ కుమార్ బీహార్ కి ప్రత్యేక హెూదా అడుగు తున్నారని,ఆంధ్ర ప్రదేశ్ కి పదేళ్లుగా హెూదా ఇవ్వలేదని, గత ఐదేళ్లలో వైసిపి, టీడీపీ కేంద్రం మీద ఒత్తిడి తెలేక పోయాయని విమర్శించారు. సిఎం చంద్ర బాబు నాయుడు హెూదా కోసం కృషి చేయడానికి ఇదే సరైన సమయ మన్నారు. దీనిని ఆయన సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ప్రధాని మోడీ కేంద్రంలో ఎన్డిఎ కూటమి బదులు బీజేపీ ప్రధాని మాత్రమే అనుకుంటున్నారని విమర్శించారు. కేంద్రంలో, రాష్ట్రంలో డబల్ ఇంజిన్ సర్కార్ వచ్చినందున రైల్వే జోన్ పనులు త్వరగా చేపట్టాలని డిమాండ్ చేశారు. మీడియా సమావేశంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జే.వీ. సత్యనారాయణ మూర్తి, రాష్ట్రసహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వర రావు, జిల్లా కార్యదర్శి ఎం. పైడి రాజు,సీపీఐ విశాఖ జిల్లా కార్యవర్గ సభ్యులు పి. చంద్రశేఖర్ పాల్గొన్నారు.

# 7న విజయనగరం జిల్లా ఓపెన్ చెస్ టోర్నమెంట్



**విజయనగరం, (విశాఖ సమాచారమ్):** ది విజయనగరం చదరంగం అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీ ఆదివారం నాడు విజయనగరం జిల్లా ఓపెన్ చెస్ టోర్నమెంట్ నిర్వహించనున్నామని టోర్నమెంట్ కమిటీ సభ్యులు ఎన్.బంగారు బాబు పేర్కొన్నారు .ఈరోజు ఉదయం టోర్నమెంట్ కు సంబంధించి ఆహ్వాన ప్రతులను జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి సిహెచ్ వేణుగోపాల్ తో కలిసి ఆవిష్కరించి మాట్లాడుతూ .పోటీలో పాల్గొనేందుకు ఎటువంటి ఎంట్రీ ఫీజు లేదని తెలియజేశారు .ఏడో తేదీ ఉదయం 9 గంటలకు ఉడా కాలనీ బంగారమ్మ గుడి దగ్గరలో గల ఎన్ ఎస్ ఆర్ ఫంక్షన్ హాల్ లో టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని అన్నారు . ప్రథమ ద్వితీయ తృతీయ బహుమతులతో పాటు 0-7,-0-9, 0-11,0-13, 0-15,0-17,0-19 వయస్సు గల గ్రూపులలో ప్రథమ ద్వితీయ స్థానాలు సాధించిన వారికి బహుమతులు ఉంటాయని అన్నారు పూర్తి వివరాల కోసం 9100469919 నెంబర్ (టి సన్నీ మాస్టర్ ) కు సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ కమిటీ సభ్యులు ఈపు విజయ్ కుమార్ , ,సముద్రాల గురు ప్రసాద్ , ఎస్‌విఎస్ రామకృష్ణ ,ఆర్ వి తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.పోటీలలో పాల్గొనే క్రీడాకారులకు ఉచిత భోజన సదుపాయం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

## నేను బ్రాహ్మణ్ణి, నా మద్దతు రాహుల్ గాంధీకి : జగన్ మురారి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** రాహుల్ గాంధీ పార్లమెంట్ లో బీజేపీ మీద చేసిన ఆరోపణలు కాంగ్రెస్ నాయకులు జగన్ మురారి సమర్థించారు. నేను కాంగ్రెస్ లో కొనసాగుతున్నాను కాబట్టి రాహుల్ ని సమర్ధించట్లేదని, నేను సూటిగా మాట్లాడే వ్యక్తినని దేశంలో బీజేపీ హిందుత్వ పేరుతో హింసను ప్రేరేపిస్తోందని, ఒక బ్రాహ్మణుడుగా నేను మోదీ నాయకత్వాన్ని సమర్థించబోనని ఆయన అన్నారు. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మాట్లాడిన దాంట్లో తప్పేమి లేదని ఈ హిందువుల ఓట్లతో గెలుస్తున్న బీజేపీ హిందువుల కోసం ఏం చేసిందని, హిందూ మతంలో పుట్టిన వాడికి ఉద్యోగం ఇచ్చిందా? ఆకలి తీర్చిందా? నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించిందా? అంబానీ, అదానిలకు మాత్రమే మోదీ సర్కార్ అన్ని కట్టాబేడుతోంది.గత పది సంవత్సరాల మోదీ పాలనలో అన్ని అంశాల పై పార్లమెంట్ లో సుదీర్ఘ చర్చ జరపాలి, మోదీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు పెద్ద నోట్ల రద్దు, జి ఎస్ టి,దేశ జిడిపి,వివిధ రాష్ట్రాలకు చేసిన అభివృద్ధి అన్ని అంశాల మీద సుదీర్ఘ చర్చ జరపాలని జగన్ మురారి డిమాండ్ చేసారు.

# విజన్ ఉన్న నాయకుడి చరిష్మాకి నిదర్శనం



**భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్):** విజన్ ఉన్న నాయకుడి పాలనకు, సైకో చేష్టలు ఉన్న నాయకుడి పాలనకు ఎంత వ్యత్యాసం ఉందో జూలై 1వ తారీకున ఎన్టీఆర్ భరోసా పథకం ద్వారా ఫించన్ల పంపిణీ కార్యక్రమం చూస్తే అర్ధమవుతుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు అన్నారు భీమిలి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మీడియాతో గంటా నూకరాజు మాట్లాడారు ఈనెల ఒకటవ తారీకున రాష్ట్రమంతా పండగ వాతావరణం సంతరించు కుందని అన్నారు 45 ఏళ్ళు రాజ కీయ అనుభవం ఉండి నాలుగు సార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన ఒక నాయకుడి చరిష్మా ఏ విధంగా ఉంటుందో అర్ధమవుతుందని అన్నారు గత ఐదేళ్లు రాక్షస పాలన కబంద హస్తాల్లో నుండి ఒక గొప్ప దార్శనికుడి చేతిలోకి రాష్ట్రం వెళ్లిందని ఆనందంలో రాష్ట్రంలో ఉండే అవ్వాతాతలు, మహిళలు, యువత, విద్యావంతులు, మేధావులు ఇలా అన్ని వర్గాల ప్రజలు ఉన్నారని అన్నారు గత పాలనలో ప్రభుత్వ ఉద్యోగుల సైతం జీతాలు కోసం ఎదురుచూసే రోజులు ఉన్నాయని అన్నారు రెండు మూడు నెలలు జీతాలు లేని దుర్భరమైన రోజులు కూడా చూశారని అన్నారు కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా అధి కారం చేపట్టిన రెండు వారాలకే ఒకటవ తారీకున జీతాలు ఉద్యోగుల ఖాతాలో పడ్డాయని అన్నారు అదేవిదంగా ఫించన్ పంపిణీ విషయంలో కూడా ఎక్కడా రాజీ పడకుండా అనుకున్నట్లు గానే 4వేల రూపాయలు పింఛన్ ని ఏప్రిల్,మే,జూన్ మూడు నెలల బకాయితో కలిపి ఒక్కరోజులోనే ఒక్కొక్క లబ్ధిదారునికి 7 వేల రూపాయలు పంపిణీ చేయించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు దని అన్నారు ఎన్నికల సమయంలో ఫించన్ పంపిణీలో జగన్ రెడ్డి ప్రభుత్వం లబ్ధిదారులను అనేక అవస్థలకు గురి చేసిందని అన్నారు వాలంటీర్లు లేకపోవడం వలన ఇంటింటికి వెళ్లి ఇవ్వలేమని అందరూ సచివాలయంకి వచ్చి తీసుకోవాలని సూపర్ మేన్ సజ్జల రామకృష్ణా రెడ్డి సూచనలతో 32 మంది పింఛన్ లబ్ధిదారులు ఎండ వేడికి తట్టుకోలేక చనిపోయారని అన్నారు ఇప్పుడు వాలంటీర్లు లేక పోయినా ఒక్కరోజులోనే వందకు వంద శాతం పింఛన్ పంపిణీ జరి గిందని ఇదీ ఒక నాయకుడికి ఉండే చరిష్మా అని గంటా నూకరాజు చెప్పారు అదేవిదంగా సూపర్ సిక్స్ పథకాలకు కూడా రూపకల్పన జరుగుతుందని అన్నారు.

## శ్రీశ్రీశ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకున్న కలెక్టర్ దంపతులు



**సింహాచలం, (విశాఖ సమాచారమ్):** విశాఖపట్నం కలెక్టర్ శ్రీ ఎం.ఎన్. హరేంద్ర ప్రసాద్ దంపతులు శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు ఆలయ కార్య నిర్వహణ అధికారి శ్రీనివాసమూర్తి నాదస్వర వేదమంత్రాలతో స్వాగతం పలికి ముందుగా స్వామి వారి కప్పస్తంభం ఆలింగనము తదుపరి బేడా మండపం ప్రదక్షణ అనంతరము స్వామివారి అంతరాలయం దర్శనం అనంతరం వేద పండితులచే వేద ఆశీర్వచనము చేసి స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి ఈఓ శ్రీనివాసమూర్తి స్వామి వారి ప్రసాదాలను అందజేశారు. వీరితో విశాఖపట్నం ఆర్డిఓ మరియు భీమిలి ఆర్డిఓ చిన్న గదిలి ఎమ్మార్వో తదితరులు ఉన్నారు.

## ఉమా రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్న పల్లా



గాజువాక, (విశాఖ సమాచారమ్): 65వ.వార్డులో శ్రీశ్రీశ్రీ ఉమారామ లింగేశ్వర ఆలయానికి దర్శనార్థం విచ్చేసిన టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు గాజువాక నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లా.శ్రీనివాసరావు వారిని పూర్ణ కుంభంతో స్వాగతం పలికి విశిష్ట పూజలు జరిపిన ఆలయ అర్చకులు పాటిభళ్ళ.శివశాస్త్రి ఆలయ కమిటీ సభ్యులు సిగటాపు సుజాత, కోరుకొండ.మంగ,జిఈశ్వ రమ్మ, మజ్జి.నాగకుమారి డీవీ జగదీశ్, రట్టి. వాసు, బయ్యపు చిన్న,యిలా.శివ,ఎస్ కోటి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ మంత్రి దాడి జన్మదిన వేడుకలు



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): మాజీ మంత్రి దాడి వీరభద్రరావు గారు 75 వ పుట్టినరోజు వేడుకలు కోరిబిల్లీ ఆరుద్ర. కోరిబిల్లీ పరి ఆధ్వర్యంలో పట్టణంలోని గవరపాలెం సంత బయల వద్ద బుధవారం ఘనంగా జరిగాయి . ఈ సందర్భంగా జన్మదిన కేక్ కటింగ్ చేసి స్థానికులకు స్వీట్స్ చాక్లెట్స్ పంపిణీ చేశారు. అలాగే పేద మహిళలుకు చీరలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు .ఈ కార్యక్రమంలో దాడి అభిమానులు కర్రీ చిన్నప్పల నాయుడు.పతకం శెట్టిశ్రీను, కర్రీఅప్పాజీ, కర్రీనారాయణరావు. సూరిశెట్టి బంగారు నాయుడు, కొణతాల వాసు, మద్దాల సంతోష్. మల్ల గణేష్. బుద్ధ నాగు. పాల్గొన్నారు.

## నూతన చెత్త తరలింపు వాహనం ప్రారంభం



గాజువాక, (విశాఖ సమాచారమ్): గాజువాక జోన్-6 పరిధిలో చెత్త తరలింపుకై ఏర్పాటు చేసిన కొత్త వాహనం(టిప్పర్)ను నియోజకవర్గ శాసన సభ్యుడు పల్లా శ్రీనివాసరావు జోనల్ కార్యాలయం వద్ద బుధవారం ప్రారంభించారు.జోనల్ కమిషనర్ బంటు సన్యాసి నాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పల్లా మాట్లాడుతూ గాజువాక నియోజకవర్గ పరిధిలో శుభ్రతకు పెద్దపీట వేయాలని సూచించారు.ఆరోగ్య సమాజ స్థాపనలో అందరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జోనల్ పరిధిలోని కార్పొరేటర్లు,అధికారులు పాల్గొన్నారు.

## మంచినీటి సమస్యను పరిష్కరించిన కూటమి నాయకులు



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): జీవీఎంసీ 80వ వార్డు పాత 23వ వార్డు చినరామస్వామి కోవెల ఎదురుగా ఉన్న మొండెగుడెంలో చేతి బోరు పనిచేయడం లేదని జీవీఎంసీ ఏర్పాటుచేసిన వాటర్ ట్యాంక్ నీటి కుళాయిలు,రాకపోవడం వల్ల నీటి సమస్య తీవ్రత ఎక్కువగా ఉందని వెంటనే చేతి బోరును రిపేర్ చేయించవలసిందిగా ఆ ప్రాంత మహిళలు ఆ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బొడ్డేడ మురళి జనసేన అధ్యక్షులు సూరిశెట్టి రాముడు దృష్టికి తీసుకువెళ్లగా సంబంధిత అధికారితో బొడ్డేడ మురళి మాట్లాడి వెంటనే సమస్యను పరిష్కారం చేయించారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పెంటకోట చంద్రరావు మళ్ళ రామ అప్పారావు కర్రి సేమియా రాము జనసేన నాయకులు కాండ్రేగుల బుజ్జి పాల్గొన్నారు.

## అనకాపల్లి జిల్లా కలెక్టర్‌గా కే.విజయ



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): అనకాపల్లి జిల్లా నూతన కలెక్టర్‌గా కే.విజయ నియమితు లయ్యారు. ఇప్పటి వరకు ఆమె సోషల్ వెల్ఫేర్ డైరెక్టర్‌గా విధులు నిర్వహించారు. ఇంత వరకు జిల్లా కలెక్టర్ గా పనిచేసిన రవిపట్టాన్ శెట్టి బదిలీ అయ్యారు.

## స్వరూపానందేంద్ర స్వామి పై దుష్ప్రచారం తగదు

విశాఖ బ్రాహ్మణ సంఘం నేతలు హితవు



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): స్వార్థపరమైన రాజకీయ దురుద్దేశాలతో హిందూమత స్వాములపై దుష్ప్రచారం తగదని విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్పి) నేత విజయ శంకర్ ఫణి హితవు పలికారు. డాబాగార్డెన్స్ విజేఎఫ్ ప్రెస్ క్లబ్‌లో బుధవారం పెందుర్తి బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల కొంత మంది స్వామీజీల వైఖరి వల్ల బ్రాహ్మణ వ్యవస్థకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.స్వామీజీల మీద దుష్ప్రచారం తగదని హితవు పలికారు. స్వామిజీలు అంటే సర్వ సంఘా పరిత్యాగం చేసే వారని ఆయన గుర్తు చేశారు. కాగా క్రైస్తవులు, మసీదులలో జరిగే వ్యవహారంల మీద ఎవ్వరూ రొడ్డెక్కడం లేదన్నారు. కాషాయం ముసుగులో అజెండా అంటూ రాద్ధాంతం చేయడం తగదన్నారు. కొందరు స్వామీజీలు తీరు మారకుంటే అన్ని వర్గాలు, కులాల వారు బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

అన్యమత అక్రమాలు, ఆక్రమణలపై మీద చర్యలు తీసుకోవాలని కోరారు. సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాస్ ఆనంద శర్మ రాజకీయాలు మాట్లాడం విడ్డూరంగా ఉందన్నారు. శారదా పీఠం అధిపతి స్వరూపానంద సరస్వతి మీద లేని పోనీ ఆరోపణలు చేయడం సరికాదని తెలిపారు. స్వామీజీ అంటే సమాజంలో ఆదర్శంగా వుండాలన్నారు. స్వాములకు రాజకీయాలు ఎందుకని ప్రశ్నించారు. పీఠాలకు ప్రభుత్వాలు భూములు ఇవ్వడం సర్వ సాధారణ విషయమన్నారు. స్వాములు స్వార్థపరమైన రాజకీయాలకు దూరంగా ఉండాలన్నారు.మీడియా సమావేశం లో రాష్ట్ర మానవ హక్కుల సంఘం డైరెక్టర్ శివ గణేష్ శాస్త్రి,ఏ ఎన్ కే.శాస్త్రి, సూర్య ప్రకాశ శర్మ, స్వారూప్ శర్మ, ప్రమోద్ శర్మ, అశోక్ శర్మ, బీజేపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాధవి లత చార్లెస్, సంఘం నేతలు విజయ కుమార్ శర్మ, ఎన్ జే పి పార్టీ నేత ఈ.వీ.రమణ, తదితరులు పాల్గొన్నారు.

## కుటమి నాయకులు ఏ యూ లో పరిపాలన గాడిలో పెట్టాలి



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): ఆంధ్ర విశ్వ కళా పరిషత్ యూనివర్సిటీలో జరుగుతున్నటువంటి అనేకమైనటువంటి ఉద్యమాలతో విద్యార్థి పరిశోధక మరియు ఉద్యోగ ఉద్యోగుల ఆందోళనతో యూని వర్సిటీలో ధైర్యాన్ని మనోబలాన్ని పెంచేం దుకు ఆంధ్రా యూనివర్సిటీకి విచ్చేసినటువంటి గంట శ్రీనివాసరావు వంశీకృష్ణ యాదవ్ వెలగపూడి మరియు సీఎం రమేష్ వీరు ముగ్గురు కూడా యూనివర్సిటీలో ఎప్పటి లాగానే సాధారణ పరిస్థితులు నెలకొల్పుతామని మరియు పూర్వ వైభవాన్ని తీసుకువస్తామని ప్రకటించిన కూటమి సభ్యులు, ఈ ప్రకటనతో ఆంధ్ర యూనివర్సిటీ ఆనందాలు దీపావళి పండుగలు మరియు జాతర తలపించిన సంగతి తెలిసిన విషయమే తదనంతర పరిస్థితులు ఇంతవరకు కూడా వైస్ ఛాన్సలర్ రాజీనామాన్ని ఆమోదించని పరిస్థితి చూస్తూ ఉన్నాం. మరి కొద్ది రోజుల్లో యూనివర్సిటీ వన ప్రారంభం జరుగుతుంది పరి పాలన సంబంధించి ఇంతవరకు యూనివర్సిటీలో వైస్ ఛాన్సర్ నియమించకపోవడంతో గాడి తప్పే పరిస్థితులు ఉన్నవి. తక్షణమే కూటమి నాయకులు వంశీ కృష్ణ శ్రీనివాస్ వెలగపూడి రామకృష్ణ బాబు గంట శ్రీనివాసరావు మరియు సీఎం రమేష్ యూనివర్సిటీ పరిస్థితులపై దృష్టి సారించాలని ఆంధ్ర యూనివర్సిటీ పరిరక్షణ సభ్యులు కోరుతున్నారు అదే రకంగా ఆంధ్ర యూనివర్సిటీలో ఏ డేట్ ఫ్యాకల్టీని యూనివర్సిటీ నుండి పంపాలని అదే రకంగా జీతాలు కూడా మనమే ఇవ్వవలసి రావటంతో ఆర్థికంగా చాలా భారంగా ఉందని తెలుస్తుంది. అదే రకంగా ఇంచార్జ్ బిసి లేకపోవటం వల్ల ఎంత మటుకు ఉద్యోగులకు జీతభత్యాలు కూడా ఇచ్చే పరిస్థితిలో లేకపోవడం పరిపాలన గాడి తప్పుతుం దంటకి ఒక ఉదాహరణ తక్షణమే కోటమి సభ్యులు పరిస్థితిని చక్కబెట్ట వలసిన అవసరం ఉందని ఆంధ్ర యూనివర్సిటీ పరిరక్షణ సమితి సభ్యులు డాక్టర్ అర్జునుడు డాక్టర్ సురేష్ మీనస్ డాక్టర్ శ్రీనివాస్ డాక్టర్ దాస్ డాక్టర్ భాను తదితరులు తమ అభిప్రాయాలను ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు.

## వెలుగు విఓఎల సమస్యలు పరిష్కరించాలి



అరకులోయ, (విశాఖ సమాచారమ్): అరకు వేలి మండల కేంద్రంలో వెలుగు సిబ్బంది అరకు పార్లమెంట్ అధ్యక్షులు మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ కు సమస్యలు పరిష్కరించాలని మాజీ మంత్రి అరకు పార్లమెంట్ అధ్యక్షులు కిడారి శ్రావణ్ కుమార్ కు వినతిపత్రం అందించారు ఈ సందర్భంగా మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ వెలుగులో పని చేస్తున్న విఓఎ లకు కాల పరిమితి సర్క్యులర్ రద్దు చేయాలనీ హెచ్ ఆర్ పాలసి అమలు చేయాలనీ వెలుగు సిబ్బందికి గుర్తింపు కార్డుతో పాటు యూనిపాం ఇవ్వాలని వెలుగు సిబ్బంది సమస్యలు గత వైసీపీ ప్రభుత్వంలో కనీసం పట్టించుకోలేదని NDA ప్రభుత్వంలో వెలుగు సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని మాజీ మంత్రి కిడారి శ్రవణ్ కుమార్ కు వినతిపత్రం అందించారు.

## సీజనల్ వ్యాధులు పట్ల అవగాహన కార్యక్రమం



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): జీవీఎంసీ పరిధిలోని 84 వ వార్డు లోనున్న కొట్నీ వీధి, సిరసపల్లి లలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది చిన్నపిల్లలకు సీజనల్ వ్యాధులు రాకుండా ప్రజలు అప్రమత్తం గా ఉండాలని బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ మాధం శెట్టి చిన్న తల్లి , వార్డు ఇన్చార్జ్ మాదంశెట్టి నీలబాబు ర్యాలీ లో పాల్గొన్నారు. అనంతరం వార్డ్ కార్పొరేటర్ మాదంశెట్టి నీలబాబు- చిన్న తల్లి ఓఆర్ఎస్ లు టానిక్ లు సీజనల్ వ్యాధులు కి మందులు పంపిణీ చేయడం జరిగింది అనంతరం డాక్టర్ జి నాగేంద్ర మాట్లాడుతూ చిన్నపిల్లల సీజనల్ వ్యాధులు భారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం జనసేన నాయకులు కొట్నీ రాంబాబు, దుడ్డు నాగేశ్వరరావు, షేక్ రియాజ్, అయోధ్య వాసు,సిరసపిల్లి సన్యాసిరావు, రాజు సిహెచ్ దుర్గాప్రసాద్ సిరసపల్లి శ్రీను నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

## వల్లూరులో వరి విత్తనాల పంపిణీ



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): 80 వార్డ్ లోనున్న వల్లూరు గ్రామ 26వ సచివాలయం లో బుధవారం రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం వార్డు ఇన్చార్జి బిఎస్ ఎం.కె జోగి నాయుడు మారిశెట్టి భాస్కర్ రావు ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఎర్ర సత్యనారాయణ ,కట్టా మాణిక్యం ,కనుమ రెడ్డి గోవింద రవి, గొల్లవిల్లి బుజ్జి, గొర్లి రామ గోవింద సిమ్మా ముసలి నాయుడు ,కట్ట శ్రీను, అండి బోయిన శంకర్రావు, నాగేశ్వరరావు, ప్రసాదు గొర్లి రాము గొర్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కొణతాలను మర్యాదపూర్వకంగా కలిసిన మోటారు సైకిల్ మెకానిక్ సంఘం



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): స్థానిక జనసేన పార్టీ కార్యాలయం లో అనకాపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు మాజీ మంత్రివర్యులు కొణతాల రామకృష్ణ ను బుధవారం అనకాపల్లి మోటార్ సైకిల్ మెకానిక్ సంఘం వారు మర్యాదపూర్వకంగా కలిసి పలు సమస్యలపై వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు మెంబర్లు పాల్గొన్నారు.

## గరివిడిలో జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ ఆకస్మిక తనిఖీలు



విజయనగరం: జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా ప్రజలకు ఏవిధంగా సేవలు అందుతున్నాయనే అంశాలను తెలుసుకునే నిమిత్తం జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ బుధవారం నుంచి క్షేత్రస్థాయి పర్యటనలకు శ్రీకారం చుట్టారు. ముందుగా వైద్య, విద్యాశాఖల పనితీరుపై పరిశీలన చేశారు. దీనిలో భాగంగా గరివిడి మండలంలో పర్యటించి కోనూరులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీచేసి ఆయా సంస్థల ద్వారా అందుతున్న సేవలను తెలుసుకున్నారు. ఆసుపత్రి ప్రసవాలు, ఓ.పి. తనిఖీలు, మందుల సరఫరా, పరికరాల వినియోగం వంటి వివిధ అంశాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్వహణ, వైద్యుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేసిన జిల్లా కలెక్టర్ నెలరోజుల్లో తమ పనితీరు మెరుగుపరచుకోవాలని వైద్యాధికారులను ఆదేశించారు. నెలరోజుల తర్వాత కూడా పనితీరు మెరుగుపడకపోతే చర్యలు తప్పవని స్పష్టంచేశారు.

పిహెచ్‌సిలో ప్రసవాల గురించి కలెక్టర్ ఆరా తీయగా ఎంతగా వారిని ప్రోత్సహిస్తున్నా ఇక్కడ ప్రసవాలకు గర్భిణీలు ఎవరూ ముందుకు రావడం లేదని చీపురుపల్లి సి.హెచ్.సికే వెళ్లి అక్కడ ప్రసవాలు చేసుకునేందుకే మొగ్గు చూపుతున్నారని వైద్యాధికారి వెంకటరమణమ్మ వివరణ ఇచ్చారు. దీనిపై సంతృప్తి చెందని కలెక్టర్ నెలరోజుల్లోగా ఇక్కడ ప్రసవాలు నమోదు కావాలని స్పష్టంచేశారు. లేనిపక్షంలో క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఆసుపత్రిలో ఫిజియోథెరఫీ కోసం సరఫరా చేసిన పరికరాలు దుమ్ము పట్టి వుండటాన్ని గమనించి వాటిని ఎందుకు వినియోగించడం లేదని ప్రశ్నించారు. వాటిని వినియోగంలోకి తీసుకురావాలని చెప్పారు. ఓ.పి.నమోదు రిజిష్టర్‌ను పరిశీలించి ఓ.పి. సంఖ్య తక్కువగా వుండటంపై కలెక్టర్ ఆరా తీశారు. ఒక వైద్యుడు మాత్రమే ఓపి ఎందుకు చూస్తున్నారని ఇద్దరూ ఓ.పి.తనిఖీలు చేయాలని స్పష్టంచేశారు. లేబొరేటరీని సందర్శించి అక్కడ ఏర్పాటు చేసిన అధునాతన పరికరాలను వాటి వినియోగంపై ఆరా తీశారు. ప్రభుత్వం ఇక్కడి పి.హెచ్.సి. కోసం ఎంతో వైద్య పరీక్షలు నిర్వహించే అధునాతన పరికరాలను మంజూరు చేసినప్పటికీ పూర్తిస్థాయిలో వినియోగం కావడం లేదని పేర్కొన్నారు. మందులు నిల్వచేసే స్టోర్‌ను పరిశీలించి మరికొద్ది రోజుల్లో గడువు తీరిపోయే మందులు వుండటాన్ని గమనించి వాటిని ఇంకా స్టోర్‌లో ఎందుకు వుంచారని, అలాంటి మందులు రోగులకు ఇస్తే వారి ప్రాణాలకు ప్రమాదమని చెబుతూ స్టోర్ నిర్వహణపై అసంతృప్తి వ్యక్తంచేశారు.

ఆసుపత్రిలో వివిధ అనారోగ్య కారణాలతో చేరిన రోగులతో మాట్లాడి వారు ఏ సమస్యలతో చేరిందీ తెలుసుకొని వారికి అందుతున్న వైద్య సహాయంపై ఆరా తీశారు.

**జెడ్పీ హైస్కూల్ నిర్వహణపై సంతృప్తి**

కోనూరు జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ విద్యార్థుల విద్యా విషయ పరిజ్ఞానాన్ని పరీక్షించడంతోపాటు పాఠశాలలో మరుగుదొడ్ల నిర్వహణ, మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. ముందుగా పదోతరగతి విద్యార్థులు వున్న గదికి వెళ్లి విద్యార్థులతో ముచ్చటించారు. బయాలజీ పాఠ్యపుస్తకంలో వున్న పాఠ్యాంశాలపై విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి వారి పరిజ్ఞానాన్ని తెలుసుకునే ప్రయత్నం చేశారు. విద్యార్థులు సంతృప్తికరంగా సమాధానాలు ఇవ్వడంతోపాటు తమ ఉపాధ్యాయులు చక్కగా బోధన చేస్తున్నారని తెలిపారు. పాఠశాలలో ఎంతమంది విద్యార్థులు చదువుతున్నదీ వారిలో పదోతరగతి విద్యార్థులు ఎంతమంది వున్నారని ఆరా తీశారు.

మధ్యాహ్న భోజనం నాణ్యత, మెనూ ప్రకారం రోజువారీగా ఆయా ఆహార పదార్థాలు వండిపెడుతున్నదీ లేనిదీ ఆరా తీశారు. తమకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెడుతున్నారని విద్యార్థులు కలెక్టర్‌కు తెలిపారు. బుధవారం నాటి మెనూ పరిశీలించి గుడ్డు, బంగాళాదుంప కుర్మా, ఆకుకూర బిర్యానీ వండి పెడుతున్నదీ లేనిదీ తెలుసుకునేందుకు వంటలు చేస్తున్న ప్రదేశానికి వెళ్లి పరిశీలించారు. గుడ్లు, బంగాళాదుంప కూర, బిర్యానీ తదితర వంటకాలన్నీ నాణ్యతగా, శుచిగా మూతలు వేసి వుంచడంపై సంతృప్తి వ్యక్తంచేశారు. మధ్యాహ్న భోజనంకోసం కట్టెల పొయ్యిపై వంటలు చేయడాన్ని గమనించి గ్యాస్ పొయ్యి సరఫరా చేస్తామని వెంటనే జిల్లా పౌరసరఫరాల అధికారిని సంప్రదించాలని ఆదేశించారు.

పాఠశాల విద్యార్థులకు సరఫరా చేసిన బ్యాగులు ఇంకా వారికి పంపిణీ చేయని విషయాన్ని గుర్తించిన కలెక్టర్ ఇంకా ఎందుకు వారికి పంపిణీ చేయలేదని ఇన్‌ఛార్జి ప్రదానోపాధ్యాయుడిని ప్రశ్నించారు. పదిరోజుల క్రితమే వాటిని సరఫరా చేసినాపంపిణీలో జాప్యం ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. వెంటనే విద్యార్థులకు బ్యాగులు, ఇతర కిట్లను అందజేయాలని సూచించారు.

పాఠశాలలో మరుగుదొడ్లను పరిశీలించి వాటిని పరిశుభ్రంగా వుంచడంపై సంతృప్తి వ్యక్తంచేశారు.

ఈ పర్యటనలో చీపురుపల్లి ఆర్.డి.ఓ. బి.శాంతి, డి.ఎం.హెచ్.ఓ. డా.ఎస్.వి.భాస్కరరావు, తహశీల్దార్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# సినిమా



## 'తీరా కాదల్' (నెట్ ఫ్లిక్స్) మూవీ రివ్యూ!

తమిళంలో ఐశ్వర్య రాజేష్ కి మంచి క్రేజ్ ఉంది. స్టార్ హీరోల జోడీగాను .. నాయిక ప్రధానమైన కథలలోను నటిస్తూ ఆమె తన ప్రత్యేకతను చాటుకుంటోంది. ఆమె నటించిన 'తీరా కాదల్' సినిమా, 2023 మే 26వ తేదీన అక్కడి థియేటర్ లకు వచ్చింది. ఆ తరువాత ఓటీటీలోకి అడుగుపెట్టింది. రోహిన్ వెంకటేశన్ దర్శకత్వం వహించిన ఈ సినిమా, తెలుగులోను అందుబాటులోకి వచ్చింది.



గౌతమ్ (జై) చెన్నైలో ఒక సంస్థలో పనిచేస్తూ ఉంటాడు. అతని భార్య వందన (శివద) కూతురు ఆర్తి ఇదీ అతని కుటుంబం. వందన కూడా ఒక సంస్థలో హెచ్ ఆర్ మేనేజర్ గా పనిచేస్తూ ఉంటుంది. ఎలాంటి సమస్య లేకుండా వారి జీవితం హ్యాపీగా సాగిపోతూ ఉంటుంది. ఒకసారి అతను కంపెనీ పనిమీద మంగుళూరు బయల్దేరతాడు. ట్రైన్ లో అతనికి శరణ్య (ఐశ్వర్య రాజేశ్) తారసపడుతుంది. కాస్త ఇబ్బంది పడుతూనే ఒకరినొకరు పలకరించుకుంటారు.

తాను మంగుళూరు వెళుతున్నట్టుగా శరణ్యతో గౌతమ్ చెబుతాడు. ఓ ముఖ్యమైన పనిమీద తాను కూడా మంగుళూరుకే వెళుతున్నట్టుగా శరణ్య చెబుతుంది. తన భార్య పిల్లలను గురించి గౌతమ్, తన భర్త ప్రకాశ్ గురించి శరణ్య ఒకరికొకరు చెప్పుకుంటారు. మంగుళూరు వెళ్లిన తరువాత కూడా ఇద్దరూ కలుసుకోవడం .. మాట్లాడుకోవడం .. కలిసి భోజనం చేయడం చేస్తుంటారు. అలా ఇద్దరూ కూడా చాలా సన్నిహితంగా మసలుకోవడం మొదలుపెడతారు.

కాలేజ్ రోజులల్లో గౌతమ్ - శరణ్య ప్రేమించుకుంటారు. అయితే వారి పెళ్లికి శరణ్య పేరెంట్స్ ఒప్పుకోరు. తన పేరెంట్స్ అడ్డుచెప్పడం వలన శరణ్య కూడా ధైర్యం చేయలేకపోతుంది. తల్లిదండ్రులు చూసిన ప్రకాశ్ ను పెళ్లి చేసుకుంటుంది. అతను మహా ఆవేశపరుడు .. తొందరపాటు మనిషి. ఒక రేంజ్ లో అతను శరణ్యను టార్చర్ పెడుతూ ఉంటాడు. అదే విషయాన్ని గౌతమ్ తో శరణ్య చెబుతుంది. ఆమె పరిస్థితి పట్ల అతను జాలిపడతాడు.

మంగుళూరు నుంచి చెన్నై కి వచ్చిన తరువాత కూడా గౌతమ్ ను శరణ్య మరిచిపోలేకపోతుంది. తన భర్త నుంచి విడిపోయి, గౌతమ్ ఫ్లాట్ కి ఎదురుగా ఉండే ఫ్లాట్ లో దిగుతుంది. గౌతమ్ ఇంట్లో ఉన్నా .. ఆఫీసులో ఉన్నా తరచూ కాల్ చేసి అతణ్ణి టెన్షన్ పెడుతూ ఉంటుంది. తన భార్య వందనకు తెలిస్తే ఏమౌతుందోనని గౌతమ్ సతమతమవుతూ ఉంటాడు. ఆమెకి అనుమానం రాకండా ఉండటం కోసం నానా తంటాలు పడుతూ ఉంటాడు.

అయితే కొన్ని రోజులుగా గౌతమ్ ప్రవర్తనలో మార్పు రావడాన్ని వందన గమనిస్తుంది. ఆయన తన దగ్గర ఏదో విషయాన్ని దాస్తున్నాడనే విషయం ఆమెకి అర్థమవుతుంది. తాను తన భర్తను వదిలేసొచ్చాను గనుక, గౌతమ్ కూడా వందనను వదిలేసి తనతో ఉండాలని శరణ్య పట్టుపడుతుంది. ఇద్దరం కలిసి వందనకు నచ్చజెబుదామని ఒత్తిడి చేస్తుంది. అప్పుడు గౌతమ్ ఏం చేస్తాడు? ఫలితంగా ఏం జరుగుతుంది? అనేది కథ.

కాలేజ్ రోజుల్లో ప్రేమలో పడటమనేది చాలా సహజంగా జరుగుతూ ఉంటుంది. అయితే అక్కడ నుంచి జీవితంలో కొంత దూరం వెళ్లిన తరువాత .. వివాహమై ఎవరి కుటుంబాలు వారివి అయిన తరువాత కాలేజ్ ప్రేమ అనేది ఒక అందమైన జ్ఞాపకంగా మాత్రమే మిగిలిపోతే బాగుంటుంది. అలా కాకుండా ఆ ప్రేమను మళ్లీ దార్లో పెట్టాలని చూస్తే ఎలాంటి పరిణామాలు ఎదురవుతానేదే ఈ సినిమా కథ. దర్శకుడు తాను తయారుచేసుకున్న ఈ కథను చాలా ఇంట్రెస్టింగ్ గా ప్రెజెంట్ చేశాడు.

ఈ కథలో ప్రధానమైన పాత్రలు మూడే. అయినా ఎక్కడా బోర్ అనిపించకుండా .. మొదటి నుంచి చివరివరకూ ఆసక్తికరంగా కొనసాగుతుంది. స్క్రీన్ ప్లే కూడా చాలా నీట్ గా అనిపిస్తుంది. చాలా సహజంగా కథను నడిపిస్తూనే .. ఎక్కడ ఏ బ్యాంగ్ అవసరమో అక్కడ దానిని వేస్తూ వెళ్లడం వలన చివరివరకూ కూర్చోబెట్టేస్తుంది. ప్రియురాలికి .. భార్యకి మధ్యలో నలిగిపోయే ఒక యువకుడి కథ చాలామందికి కనెక్ట్ అవుతుంది.

ప్రధానమైన పాత్రలను పోషించిన ముగ్గురూ జీవం పోశారు. రియల్ లొకేషన్స్ ఈ కథకి మరింత సహజత్వాన్ని తీసుకొచ్చాయి. రవివర్మన్ ఫొటోగ్రఫీ .. సిద్ధూ కుమార్ నేపథ్య సంగీతం .. ప్రసన్న ఎడిటింగ్ ఈ కథకు మరింత బలాన్ని ఇచ్చాయి. ఆసక్తికరమైన కథాకథనాలు .. పాత్రలను తీర్చిదిద్దిన తీరు .. అనూహ్యమైన మలుపులు .. ట్విస్టులు ఆకట్టుకుంటాయి. ఫ్యామిలీతో కలిసి చూడవలసిన సినిమా ఇది.

## 'లైలా'గా వస్తున్న విష్వక్సేన్.. గ్రాండ్‌గా కొత్త చిత్రం లాంచింగ్!




టాలీవుడ్ యువ హీరో విష్వక్సేన్ కొత్త చిత్రం బుధవారం పూజ కార్యక్రమంతో గ్రాండ్‌గా లాంచ్ అయ్యింది. లైలా అనే టైటిల్‌తో వస్తున్న ఈ చిత్రం కొత్త డైరెక్టర్ రామ్ నారాయణ్ దర్శకత్వంలో తెరకెక్కనుంది. ఇది విష్వక్సేన్ హీరోగా 12వ చిత్రం. ఈ సినిమాలో విష్వక్ తొలిసారి లేడీ గెటప్‌లో కనిపించబోతున్నాడు.

ఈ సందర్భంగా మూవీ ఫస్ట్ లుక్‌ను మేకర్స్ లాంచ్ చేశారు. కాగా, ఈ పూజ కార్యక్రమానికి ప్రముఖ దర్శకుడు కే రాఘవేంద్ర రావు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయన ముహూర్తం క్లాప్ కొట్టగా.. దర్శకుడు హరీష్ శంకర్ కెమెరా స్విచ్ ఆన్ చేశాడు. ఇక విష్వక్సేన్‌కు జోడీగా ఆకాంక్ష శర్మ నటిస్తోంది. తనిష్క్ బాగ్చి బాణీలు అందిస్తున్నారు.

## ఆహా ట్రాక్ పైకి 'మార్కెట్ మహాలక్ష్మి' మూవీ!




కొంతమంది ఆర్టిస్టులకు విలేజ్ నేపథ్యంలోని కథలు .. యాసతో కూడిన పాత్రలు బాగా సెట్ అవుతాయి. అలాంటి పాత్రలతో మంచి మార్కులు కొట్టేసిన నటుడిగా పార్వతీశం కనిపిస్తాడు. 'కేరింత' సినిమాతో మంచి క్రేజ్ తెచ్చుకున్న పార్వతీశం, అప్పటి నుంచి తన బాడీ లాంగ్వేజ్ కి తగిన పాత్రలను చేస్తూనే వెళుతున్నాడు.

అలా ఆయన చేసిన సినిమానే 'మార్కెట్ మహాలక్ష్మి'. అఖిలేశ్ కిలారు నిర్మించిన ఈ సినిమాకి, ముఖేశ్ దర్శకత్వం వహించాడు. ఏప్రిల్ 19వ తేదీన థియేటర్లకు వచ్చిన ఈ సినిమా, రేపటి నుంచి 'ఆహా'లో స్ట్రీమింగ్ కానుంది. ఈ సినిమాతోనే ప్రణి కాన్విక కథానాయికగా పరిచయమైంది. మొదటి సినిమానే అయినా, నటన పరంగా మంచి మార్కులు కొట్టేసింది.

పార్వతీశం సాఫ్ట్ వేర్ ఇంజనీర్ గా పనిచేస్తూ ఉంటాడు. కూరగాయలు అమ్మే మహాలక్ష్మిని చూడగానే మనసు పారేసుకుంటాడు. అయితే అమ్మాయికి ప్రేమ అనే మాట వింటేనే చిరాకు. ఒకవేళ ఎలాగో అలా ఆ అమ్మాయిని ముగ్గులోకి దింపుదామా అని అనుకుంటే, పార్వతీశం తండ్రి తన కొడుక్కి వచ్చే భారీ కట్నంపై భారీ ఆశలు పెట్టుకుంటాడు. అలాంటి పరిస్థితుల్లో పార్వతీశం ఏం చేశాడనేదే కథ.

## 'లవ్ మౌళి' (ఆహా) మూవీ రివ్యూ!




నవదీప్ హీరోగా తెరపై కనిపించి చాలాకాలమైంది. ఈ మధ్య కాలంలో ఎక్కువగా ముఖ్యమైన పాత్రలను చేస్తూ వెళుతున్నాడు. అలాంటి అయన హీరోగా రూపొందిన 'లవ్ మౌళి' సినిమా, జూన్ 7వ తేదీన థియేటర్లకు వచ్చింది. అవనీంద్ర దర్శకత్వం వహించిన ఈ సినిమా, జూన్ 27వ తేదీ నుంచి 'ఆహా'లో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ సినిమా ఎలా ఉందనేది ఇప్పుడు చూద్దాం.

మౌళి (నవదీప్) చిన్నతనంలోనే తల్లిదండ్రులకు దూరమవుతాడు. ఊరికి దూరంగా తన తాతయ్య దగ్గర పెరుగుతాడు. తన 14 ఏటన తాతయ్యను ను కూడా కోల్పోతాడు. అప్పటి నుంచి ఒంటరితనానినికి అలవాటు పడతాడు. మనుషులంటే నచ్చనిస్థాయికి వెళ్లిపోతాడు. తన మనసులోని భావాలకు దృశ్యరూపాన్నిఇస్తూ ఆర్టిస్ట్ అవుతాడు. తన పెయింటింగ్స్ అమ్మడం వలన వచ్చిన డబ్బుతో జీవిస్తూ ఉంటాడు.

మనుషుల మధ్య ప్రేమ అనేది ఉండదు. కామానికి కొంతమంది పెట్టుకున్న పేరే ప్రేమ అనేది మౌళి అభిప్రాయం. అందువలన అతనితో ఎవరూ కూడా ఎక్కువ రోజుల పాటు రిలేషన్ కొనసాగించలేకపోతారు. అది తన తప్పా .. అవతలివారి తప్పా అనేది మౌళి తేల్చుకోలేక పోతుంటాడు. అదే సమయంలో అతనికి ఓ అఘోర (రానా) తారస పడతాడు. ప్రేమ విషయంలో మౌళికి ఉన్న అయోమయాన్ని తొలగించడానికి ఆయన ఒక మేజిక్ కుంచెను మౌళి దగ్గర వదిలేసి వెళతాడు.

ఆ కుంచెతో ఒక అందమైన అమ్మాయి చిత్రాన్ని గీసి, అలాంటి అమ్మాయి తనని ప్రేమించాలని కోరుకుంటాడు. దాంతో ఆ చిత్రంలోని అమ్మాయి రూపం ప్రాణం పోసుకుని అందులో నుంచి బయటికి వస్తుంది. ఆ యువతికి 'చిత్ర' అనే పేరు పెట్టి, ఆమెతో అతను హ్యాపీగా ఉండటం మొదలుపెడతాడు. కొన్ని రోజులు పోయిన తరువాత ఇద్దరి మధ్య మాట పట్టింపు వస్తుంది.

తనకి ఎదురు తిరిగేవారు కాకుండా, ప్రతి చిన్న విషయానికి తనపై ఆధారపడి అమ్మాయి కావాలంటూ మరో చిత్రాన్ని గీస్తాడు. ఆ యువతి ప్రాణం పోసుకుని బయటికి వస్తుంది. తానే అన్ని పనులు చేసుకోవలసి రావడంతో మౌళి విసిగిపోతాడు. సొంత అభిప్రాయాన్ని కలిగి ఉండి, తనని కేరింగ్ గా చూసుకునే అమ్మాయి కావాలంటూ మరో చిత్రాన్ని గీస్తాడు. ఎప్పటి లానే మరో యువతి ప్రాణం పోసుకుని వస్తుంది.

మూడో యువతి కారణంగా మౌళికి ఎలాంటి అనుభవం ఎదురవుతుంది? ఆమె వలన ఆయన జీవితంలో ఎలాంటి మార్పు సంభవిస్తుంది? అప్పుడు అతను ఏం చేస్తాడు? చివరికి అతను తన తప్పు తెలుసుకుంటాడా లేదా? అనేది కథ.

ఒక రచయిత రాసిన కథలోని పాత్రలు అందులో నుంచి బయటికి వచ్చి అతని జీవితాన్ని ప్రభావితం చేయడం .. ఒక ఆర్టిస్టు గీసిన చిత్రాలలో ఏవైతే దృశ్యాలు ఉంటాయో .. అవే ఆ తరువాత జరగడం వంటి కథలు గతంలో వచ్చాయి. అలాంటి ఒక కాన్సెప్ట్ తో వచ్చిన సినిమానే 'లవ్ మౌళి'. తనకి కావలసిన అమ్మాయి ఎలా ఉండాలనేది మనసులో అనుకుని, ఆమెను అలాగే డిజైన్ చేసుకుని తెచ్చుకునే ఒక ఆర్టిస్ట్ కథ ఇది.

మనుషులకు .. మావన సంబంధాలకు దూరంగా పెరిగిన ఒక యువకుడు ఎలా తయారవుతాడు? ఏది మంచో .. ఏది చెడో చెప్పేవారు లేకపోతే ఎలా పెరుగుతాడు? ఎలా ప్రవర్తిస్తాడు? అనేది చెప్పే కథ ఇది. లైన్ గా చూసుకుంటే ఈ కథ కొత్తగానే అనిపిస్తుంది. కానీ తెరపైకి ఈ కంటెంట్ కరెక్ట్ రూట్లో రాలేదేమో అనిపిస్తుంది. తనకంటూ క సెటప్ ఏర్పాటు చేసుకున్న ఒక ఆర్టిస్ట్ కీ .. తనకి కావలసినవి బయట ప్రపంచంలోకి వెళ్లి తెచ్చుకునే యువకుడికి తన ఒంటిపై ధ్యాస లేకపోవడం చిత్రంగా అనిపిస్తుంది.

ఇక మౌళికి అఘోర తారస పడటం సహజత్వాన్ని చాలా దూరంగా కనిపిస్తుంది. ఇదే కథను మలుపుతిప్పే సన్నివేశం. అయినా ఎక్కడా ఆ ఎఫెక్ట్ కనబడదు. అంతా నాటకీయంగా అనిపిస్తుంది. హీరోకి ఎవరితోనూ మంచి సంబంధాలు ఉండవు. అయినా వాళ్లంతా కలిసి ఒక ఆర్టిస్టుగా ఆయనకి మంచి పేరు తీసుకొచ్చే పనిలో నిమగ్నమై ఉండటం విచిత్రం. ఇక ఆర్టిస్టు గీసిన బొమ్మలో నుంచి అప్పుడే కాలు బయటికి పెట్టిన హీరోయిన్స్, ఆ వెంటనే పూజ చేయడం .. వంట చేయడం .. బుల్లెట్ నడపడం మరో విచిత్రం.

హీరోలో తరువాత ఎప్పటికో రావలసిన మార్పును ఒక రేంజ్ లో చూపించడం కోసం, ముందు నుంచే అతనికి ఎంతమాత్రం నప్పని హెయిర్ స్టైల్ ను సెట్ చేయడం అతనికి ఎంత ఇబ్బందిని కలిగించిందోగానీ, చూసేవారికి మాత్రం చిరాకు పుడుతుంది. ఫస్టు సీన్ లోనే హీరో స్వభావాన్ని దర్శకుడు పతాకస్థాయిలో చూపించి, ఆ కేరక్టర్ గురించి ప్రేక్షకుడు రెండో ఆలోచన చేయకుండా సైలెంట్ గా ఉండేలా చూశాడు. గోవింద్ వసంత్ నేపథ్య సంగీతం .. కెమెరా పనితనం .. ఎడిటింగ్ ఓ మాదిరిగా అనిపిస్తాయి.

ఊరికి దూరంగా ఓ నాలుగైదు పాత్రల మధ్య డిజైన్ చేసిన కథ ఇది. హీరో .. హీరోయిన్, అప్పుడప్పుడు వాళ్లను పలకరించే మరో జంట .. హీరో మాజీ లవర్. వీళ్లతోనే కథను నడిపించారు. ప్రేక్షకులకు బోర్ కొట్టకండా లిప్ లాకులు ఉంటే సరిపోతుందని అనుకున్నారేమో, డైలాగుల కంటే అవే ఎక్కువగా ఉన్నాయి. ఏ మాత్రం కొత్తదనంగానీ .. ఆసక్తికరంగా గాని లేని కంటెంట్ ఇది. ఇక టైటిల్ విషయంలో కూడా మేకర్స్ ఆలోచన చేసి ఉంటే బాగుండేదేమో.

## చరణ్ అన్న, ఉపాసన వదిన ఇచ్చిన మాటకి నా సంతోషం 1000 రెట్లు పెరిగింది: కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్



ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా పంచుకున్న ఒక పోస్ట్ వైరల్ అవుతోంది. తన బర్త్‌డే సందర్భంగా రామ్ చరణ్‌ను ఇంటికెళ్లి కలిసినట్లు జానీ మాస్టర్ ఈ పోస్టులో పేర్కొన్నారు. ఆ సమయంలో చెర్రీ తనకు ఇచ్చిన మాటను గుర్తు ఉంచుకుని మరీ నిలబెట్టుకోవడం ఆనందంగా ఉందని చెప్పుకొచ్చారు.

"నా పుట్టినరోజు సందర్భంగా రామ్ చరణ్ అన్న ఇంటికి పిలిచినపుడు వారికి నా మీదున్న ప్రేమకి చాలా సంతోషపడ్డా. అక్కడికి వెళ్ళాక మెగాస్టార్ చిరంజీవి గారి ఆశీర్వాదంతో పాటు చరణ్ అన్న, ఉపాసన కొణిదెల వదిన నాకు ఇచ్చిన మాటకి నా సంతోషం 1000 రెట్లు పెరిగింది.

నేను ఇదివరకు అడిగిన సహాయాన్ని గుర్తుంచుకుని మా డ్యాన్సర్స్ యునియన్ టీఎఫ్‌టీటీడీఏలో 500కు పైగా కుటుంబాలకు హెల్త్ ఇన్స్యూరెన్స్ అందేలా వారు అండగా నిలబడతామన్నారు. అడిగిన సహాయాన్ని గుర్తుంచుకుని, ఇచ్చిన మాటకి విలువనిస్తూ, అన్ని కుటుంబాలని చేరదీయడం మామూలు విషయం కాదు. మా అందరి మనసులో కృతజ్ఞత భావం ఎల్లకాలం ఉంటుంది.

మా అందరి తరఫున అన్న, వదినలకి మనస్పూర్తిగా ధన్యవాదాలు తెలుపు కుంటున్నాను. మీలాంటి వారితో కలిసి పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నాను" అని కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ తన 'ఎక్స్' పోస్టులో రాసుకొచ్చారు.

## 'భారతీయుడు2'లో నటించడానికి ఏకైక కారణమిదే: కమల్ హాసన్

కమల్ హాసన్ హీరోగా శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'భారతీయుడు 2' వీళ్లిద్దరి కాంబినేషన్‌లోనే వచ్చిన హిట్ సినిమా 'భారతీయుడు'కు సీక్వెల్‌గా రానుంది. జులై 12న ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమైంది. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న కమల్ హాసన్ పార్ట్3 గురించి చూడా ఆసక్తికర కామెంట్స్ చేశారు.

'నిజం చెప్పాలంటే.. 'భారతీయుడు 2' చేయడానికి ఏకైక కారణం పార్ట్3. మూడో భాగానికి నేను అభిమానిగా మారాను. సాధారణంగా ప్రేక్షకులకు మొదటి భాగం లేదా రెండో భాగం నచ్చుతుందేమో.. కానీ నాకు 'భారతీయుడు2'తో పాటు పార్ట్3 కూడా బాగా నచ్చింది. అది రిలీజ్ కావాలంటే ఆరు నెలల సమయం పడుతుంది. అప్పటి వరకు ఎలా వేచి ఉండాలో తెలియక టెన్షన్‌గా ఉంది' అని చెప్పారు. ఇక 'ఇండియన్ 3'లో సేనాపతి తండ్రి పాత్ర కూడా తెరపై కనిపిస్తుందని కమల్ ఇటీవల వెల్లడించారు. అలాగే సోషల్ మీడియాలో ఈ చిత్రం గురించి వస్తోన్న కథలేవీ నిజం కాదని స్పష్టం చేశారు.

1996లో శంకర్ దర్శకత్వంలో వచ్చి సంచలనం సృష్టించింది 'భారతీయుడు'. దానికి సీక్వెల్‌గా రెండు భాగాలు రానున్నాయి. 'భారతీయుడు 2' జులై 12న రానుండగా.. ఇది వచ్చిన ఆరు నెలలకు 'భారతీయుడు 3' రానుంది. యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ చిత్రంలో సిద్ధార్థ్, కాజల్, రకుల్ ప్రీత్‌సింగ్, ప్రియాభవానీ శంకర్, ఎస్‌జే సూర్య తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమాకు అనిరుధ్ రవిచంద్రన్ సంగీతం అందించారు.



# సమత కళాశాలలో మెగా జాబ్ మేళా






**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** వరుణ్ మోటార్స్ ఆధ్వర్యంలో స్థానిక సమత కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వరుణ్ మోటార్స్ హెచ్.ఆర్ ఎగ్జిక్యూటివ్ రోహిత్ విలియమ్స్ గారు మాట్లాడుతూ ఈ జాబు మేళా వల్ల ఎంతోమంది నిరుద్యోగ యువకులకు ఉపాధి లభిస్తుందని ,ఇటువంటి కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్న సమత కళాశాల డీన్ అండ్ కరస్పాండెంట్ డాక్టర్. ఎస్. విజయ రవీంద్ర గారికి అభినందనలు తెలియజేశారు. తదనంతరం కళాశాల డైరెక్టర్ మరియు ఇన్చార్జి ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జి. శ్రీనివాసరావు గారు మాట్లాడుతూ ఈ జాబ్ మేళా మా కళాశాలలో జరగడం వల్ల మా విద్యార్థులకు మరియు స్థానికులకు ఎంతగానో ఉపయోగపడుతుందని అందరూ ఉద్యోగమే లక్ష్యంగా ఈ కార్యక్రమంలో పాల్గొనాలని, దీనివలన విద్యార్థులకు అనుభవం కూడా వస్తుందని సూచించారు. ఈ జాబ్ మేళాలో వరుణ్ మోటార్స్ హెచ్.ఆర్ ఎగ్జిక్యూటివ్స్ ఉదయ్ కుమార్ గారు, మరియు ప్రవీణ గారు సుమారుగా 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# వాహనాలకు గ్రీన్ టాక్స్ తగ్గించేందుకు కృషి చేస్తా:ఎమ్మెల్యే పల్లా



**కూర్మన్నపాలెం, (విశాఖ సమాచారమ్):** భారీ వాహనాలకు గుదిబండగా మారిన గ్రీన్ టాక్స్ విషయమై ముఖ్యమంత్రితో మాట్లాడి తగ్గించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. కూర్మన్నపాలెంలో విశాఖపట్నం బల్క్ బిటుమేన్ అండ్ ఎల్ ఎస్ హెచ్ ఎస్ ట్యాంక్ ట్రక్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పల్లాకు ఆత్మీయ సత్కారం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం తాను గెలిచిన నెలరోజుల్లోనే అగనంపూడి టోల్ ప్లాజాను ఎత్తి వేయించానని చెప్పారు. ట్రాన్స్ పోర్ట్ వ్యాపారం అనేక రాష్ట్రాలతో ముడిపడి ఉన్న నేపథ్యంలో యజమానులకు ఇబ్బందులు కలిగేలా ఎటువంటి నిర్ణయాలు ఉండవని చెప్పారు.గాజువాకలో ట్రక్ టెర్మినల్ ప్రతిపాదన అంశమై రవాణా మంత్రి, ఉన్నతాధికారులతో చర్చించి పరిష్కార మార్గం చూపుతామని అన్నారు.తన విజయానికి సహకరించిన ప్రతిఒక్కరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బొండా జగన్,జిల్లా ఎస్సి సెల్ అధ్యక్షుడు పుచ్చా విజయ్ కుమార్, అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్ కృష్ణమూర్తి, ఉపాధ్యక్షుడు ఆర్ తులసీదాస్,ప్రధాన కార్యదర్శి రాజేష్ లాల్,గౌరవ అధ్యక్షుడు పి సత్యనారాయణ, జాయింట్ సెక్రటరీ ఎస్ కె అహ్మద్,సహాయ కోశాధికారి డి దేవన్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

# అమ్మ పేరిట ఒక మొక్క'లో భాగంగా మొక్క నాటిన కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ



**విజయవాడ, (పీఐబీ):** 'అమ్మ పేరిట ఒక మొక్క' నాటమంటూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చిన "ఏక్ పేడ్ మా కే నామ్" ప్రత్యేక ప్రచారంలో భాగంగా, కేంద్ర ఉక్కు & భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ ఒక మొక్క నాటారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రజలంతా చెట్లు పెంచేలా ప్రోత్సహించేందుకు "అమ్మ పేరుతో ఒక మొక్క" పేరిట ప్రత్యేక ప్రచారాన్ని ప్రారంభించినట్లు కేంద్ర మంత్రి చెప్పారు. వాతావరణ మార్పులను ఎదుర్కోవడానికి, కాలుష్యాన్ని తగ్గించడానికి, మన పరిసరాలను పచ్చగా మార్చడానికి ఈ చిన్న చర్య సాయపడుతుందని అన్నారు.

దేశంలోని ప్రతి ఒక్కరు ఈ ప్రచారానికి సహకరించాలని, మొక్కలు నాటే దృశ్యాలను సోషల్ మీడియాలో పంచుకుని ఈ ప్రచారాన్ని పెద్ద ఉద్యమంగా మార్చాలని మంత్రి కోరారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వానికి, ఈ కార్యక్రమాన్ని నిర్వహించినందుకు కేంద్ర ఉక్కు & భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖకు శ్రీ భూపతి రాజు శ్రీనివాస వర్మ ధన్యవాదాలు తెలిపారు.

# అటల్ ఇన్నోవేషన్ మిషన్ ద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందాలి



**విజయనగరం:** అటల్ ఇన్నోవేషన్ మిషన్‌ను పూర్తిస్థాయిలో, మరింత సమర్ధవంతంగా వినియోగించుకోవడం ద్వారా విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికితీయాలని, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలని జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ కోరారు. జిల్లా స్థాయి ఏటిఎల్ సమీక్షా సమావేశం కలెక్టరేట్ సమావేశమందిరంలో బుధవారం జరిగింది.

జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ అటల్ ఇన్నోవేషన్ మిషన్ గురించి వివరించారు. విద్యార్థులకు నూతన అభ్యాస విధానాలకోసం 2016లో కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిందని తెలిపారు. 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. దీనికోసం జిల్లాలో 42 పాఠశాలలను ఎంపిక చేశామని, వీటిలో 36 ప్రభుత్వ, 6 ప్రయివేటు పాఠశాలలు ఉన్నాయని తెలిపారు. ఎంపిక చేసిన పాఠశాలల్లో అటల్ టింకరింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

హబ్ అటల్‌గా ఎంపికైన ధర్మవరం పాఠశాల ల్యాబ్ ఇన్‌ఛార్జి రమేష్ మాట్లాడుతూ కార్యక్రమం అమలును పవర్‌పాయింట్ ద్వారా వివరించారు. నాలుగు ఏళ్లలో 65 ప్రాజెక్టులను చేశామని, వాటిలో 5 ప్రాజెక్టులు జాతీయ బహుమతులు గెలుచుకున్నాయని, ఒకదానికి పేటెంట్ దక్కిందని తెలిపారు. వివిధ పాఠశాలల ప్రతినిధులు మాట్లాడుతూ మిషన్ అమలు చేస్తున్న విధానాన్ని, సమస్యలను తెలిపారు.

జెసి కార్తీక్ మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ పరిజ్ఞానాన్ని, పరిశోధనాత్మక దృక్పథాన్ని, సృజనాత్మకతను పెంపొందించేందుకు అటల్ ఇన్నోవేషన్ మిషన్ దోహదపడుతుందని అన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకొని అటల్ ల్యాబ్స్‌ను పూర్తిస్థాయిలో విద్యార్థులకు అందుబాటులోకి తేవాలన్నారు. ఇప్పటికే ఏర్పాటు చేసిన ల్యాబ్‌లను తనిఖీ చేయాలని సూచించారు. ప్రతీ మంగళవారం జరిగే ఆన్‌లైన్ క్లాసులను కూడా పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని కోరారు. ఇంజనీరింగ్, మెడికల్, ఫార్మా కళాశాలల ప్రొఫెసర్లతో, విద్యార్థులకు గెస్ట్ లెక్చర్లు ఇప్పించాలని సూచించారు. అదేవిధంగా విద్యార్థులకు శిక్షణతోపాటు, పోటీపడేవిధంగా తీర్చిదిద్దాలని, ఎక్కడ సాంకేతిక పోటీలు జరిగినా వారిని పాల్గొనేటట్లు చేయాలని చెప్పారు. అలాగే విద్యార్థులకు పాఠాలు మరింత సులువుగా అర్థం అయ్యేందుకు వీలుగా తెలుగులో తర్జుమా చేసేందుకు సైన్స్ అసిస్టెంట్లు కృషి చేయాలని జెసి సూచించారు.

ఈ సమీక్షా సమావేశంలో డిప్యుటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్లు కె.వెంకటరమణ, మోహనరావు, జిల్లా సైన్సు కో-ఆర్డినేటర్ ఎం.కృష్ణారావు, హెడ్‌మాష్టర్లు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాళ్లు, సైన్స్ ల్యాబ్ ఇన్‌చార్జిలు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# రాజ్యసభలో సుధామూర్తి తొలి ప్రసంగం



**ఢిల్లీ:** రచయిత్రి, వితరణశీలిగా సుపరిచితురాలైన సుధామూర్తి రాజ్యసభ ఎంపీగా చేసిన తొలి ప్రసంగం అందరినీ ఆకట్టుకుంది. మహిళల ఆరోగ్యంపై తన ప్రసంగంలో వెల్లడించారు. దీనిపై తాజాగా మోదీ స్పందించారు. బుధవారం ఎగువసభకు వచ్చిన ఆయన ఆమెకు కృతజ్ఞతలు తెలియజేశారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సుధామూర్తి రాజ్యసభ ఎంపీగా నామినేట్ అయ్యారు. ప్రస్తుతం నడుస్తోన్న పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో భాగంగా మంగళవారం ఆమె సభలో మాట్లాడారు. "9 నుంచి 14 ఏళ్ల మధ్య వయసులో ఉన్న బాలికలకు సర్వైకల్ వ్యాక్సినేషన్ ఇస్తుంటారు. దానిని తీసుకుంటే.. క్యాన్సర్‌ను అడ్డుకోవచ్చు. చికిత్స కంటే నివారణ మేలు కాబట్టి.. అమ్మాయిల మెరుగైన భవిష్యత్తు కోసం దానిని అందివ్వాలి" అని వెల్లడించారు. ఈసందర్భంగా తన తండ్రి చెప్పిన మాటలను గుర్తు చేసుకున్నారు. "ఒక కుటుంబంలో తల్లి ప్రాణాలు కోల్పోతే.. ఆసుపత్రి లెక్కలో అది ఒక మరణం. కానీ ఆ కుటుంబానికి అది తీరని లోటు" అని తన మనసులో నాటుకుపోయిన ఆ మాటల సారాన్ని ఈసందర్భంగా ప్రస్తావించారు.

అలాగే కొవిడ్ సమయంలో దేశవ్యాప్తంగా నిర్విఘ్నంగా వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించామని గుర్తుచేసిన ఆమె.. ఆ అనుభవంతో సర్వైకల్ వ్యాక్సిన్‌ను బాలికలకు అందించడం కష్టమేమీ కాదని అన్నారు. దీంతోపాటు వారసత్వ సంపదను కాపాడుకోవాల్సిన ఆవశ్యకతను ప్రస్తావించారు. ఆదాయాన్ని పెంచే దిశగా పర్యటనలకు వచ్చేవారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా రోడ్లు, టాయిలెట్లు వంటి సదుపాయాలను మెరుగుపర్చాలని సూచించారు.

ఈ ప్రసంగాన్ని ఉద్దేశించి ఈ రోజు మోదీ మాట్లాడారు. "మహిళల ఆరోగ్యంపై సమగ్రంగా మాట్లాడిన సుధామూర్తిజీకి కృతజ్ఞతలు. గత పదేళ్లకాలంలో ప్రభుత్వం మహిళల ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రధానంగా దృష్టిసారించింది" అని తెలిపారు. తమ ప్రభుత్వం శానిటరీ ప్యాడ్లను పంపిణీ చేసిందని, గర్భిణీలకు వ్యాక్సినేషన్‌ను తీసుకువచ్చామని సభావేదికగా వెల్లడించారు. కాగా, సర్వైకల్ క్యాన్సర్‌ను అదుపు చేయడానికి 9 నుంచి 14 ఏళ్ల మధ్య వయసున్న బాలికలకు టీకాలు వేయించడానికి తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మధ్యంతర బడ్జెట్లో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించిన సంగతి తెలిసిందే.

# ఎంఎల్ఏ గారూ పెండింగ్ సమస్యల పరిష్కారం పై దృష్టి సారించండి



**భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్):** ఓటమి ఎరుగని గంటా శ్రీనివాసరావు కు 2024 ఎన్నికల్లో భీమిలి నియోజక వర్గ ప్రజలు బ్రహ్మరథం పట్టి ఎన్నడూ లేని విధం గా 92401 ఓట్ల మెజార్టీ తో గెలిపించి రాష్ట్రం లోనే ద్వితీయ స్థానం లో నిలిచేలా చేసారు. భీమిలి ప్రజలు శాంతపరులు. నమ్మితే ఆ వ్యక్తులను విస్మరించరు . సరిగ్గా గంటా శ్రీనివాసరావు విషయం లోని అదే జరిగింది. 2014,2024 ఎన్నికల్లో ప్రజలు ఆయన్ను గెలిపించారు. అయితే ప్రజలు నమ్మకాన్ని వమ్ము చేయకుండా వారు ఎదుర్కొంటున్న పలు పెండింగ్ సమస్యలను పరిష్కసరించవలసిన బాధ్యత శత శాతం ఎంఎల్ ఏ గంటా శ్రీనివాసరావు పైనే ఉన్నది.కూటమి ప్రభుత్వం లో తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావడం తో సంక్షేమం తో పాటు అభివృద్ధి కూడా జరుగుతందని ప్రజలు బలం గా విశ్వసిస్తున్నారు. ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా పెండింగ్ సమస్యల తోపాటు ఇతర సమస్యలనుకూడా పరిష్కరిస్తూ ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీల మేరకు నియోజకవర్గం ను అభివృద్ధి చేసి ఆదర్శ నియోజక వర్గం గా తీర్చి దిద్దవలసిన బాధ్యత ముమ్మాటికీ ఎం ఎల్ ఏ గంటా శ్రీనివాసరావు పైనే ఉన్నది.

**నియోజక వర్గం లో పెండింగ్ సమస్యలు :** మూడు ప్రభుత్వాలను చూసిన తగరపువలస లో **ఆర్ టి సి కాంప్లెక్స్ శిలాఫలకాలు** :భీమిలి ప్రజల చిరకాల వాంఛ అయిన తగరపువలస లో ఆర్ టిసి కాంప్లెక్స్ అందని ద్రాక్షగానే మిగిలిపోయింది.సుమారు 20 సంవత్సరాలుగా పెండింగ్ గానే ఉన్న ఆర్ టి సి కాంప్లెక్స్ 2005 లో నగరబాట కార్యక్రమం లో భాగం గా అప్పటి ముఖ్యమంత్రి వై ఎస్ రాజశేఖరరెడ్డి శంకుస్థాపన చేసి గాలికొదిలేసారు. 2014 లో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి, స్థానిక ఎం ఎల్ ఏ గంటా శ్రీనివాసరావు 2018 లో తగరపువలస గోస్తనీ తీరం వద్ద సుమారు 7 కోట్ల రూపాయిల వ్యయం తో చేపట్టే ఆర్ టి సి కాంప్లెక్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేసారు. అయితే 2019 లో వైసీపీ ప్రభుత్వం రావడం తో ఆర్ టి సి కాంప్లెక్స్ నిర్మాణానికి గ్రహణం పట్టింది.

అయితే ఎల్లప్పుడూ ప్రచార ఆర్భాటలు కోరుకొనే వైసీపీ ఎం ఎల్ ఏ అవంతి శ్రీనివాసరావు ఎన్నికలు సమీపిస్తున్న తరుణం లో అంటే 2024 మార్చి 2న దివిస్ ఆర్థిక సహాయం 2కోట్ల రూపాయిల వ్యయం తో (విడ్డూరం గా గంటా శ్రీనివాసరావు శంకుస్థాపన చేసిన స్థలంలోనే) హడావుడి గా ఆర్ టి సి కాంప్లెక్స్ కు శంకుస్థాపన చేసేసారు( అది జరగదని తెలుసుకొన్నారో ఏమో గాని హడావుడి గా శంకుస్థాపన చేసేసారు). ఇలా ముచ్చటగా మూడు ప్రభుత్వాలను ఏర్పాటుకాని ఆర్ టి సి కాంప్లెక్స్ చూసేసింది. ఇక నాల్గవ ప్రభుత్వం వచ్చిన తరువాత అయినా తనను ప్రారంభించకపోతారా అని ఆర్ టి సి కాంప్లెక్స్ పెద్ద కళ్ళతో ఆశగా ఎదురుచూస్తున్నది.

**రెండు ప్రభుత్వాలను చూసిన చిట్టివలస - చిల్లపేట చెరువు సుందరీకరణ పనులు** :భీమిలి జోన్ చిట్టివలస - చిల్లపేట మధ్య గల పెద్ద చెరువు సుందరీకరణ పనులు పూర్తి కాకుండానే రెండు ప్రభుత్వాలు మారడం చూసింది. అయినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నట్లు ఉంది. 2014 అప్పటి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి, స్థానిక ఎం ఎల్ ఏ గంటా శ్రీనివాసరావు 2018 డిసెంబర్ 1న సుమారు 36.40 ఎకరాల విస్తీర్ణం లో గల పెద్ద చెరువు కు సుమారు రూ "1కోటి 98 లక్షల వ్యయం తో సుందరీకరణ పనులకు శంకుస్థాపన చేసారు.ఆదిలో పనులు ప్రారంభం అయినా 2019లో వైసీపీ ప్రభుత్వం ఏర్పడ్డ తరువాత చెరువు పనులు ఆగిపోయాయి. అయితే ఈ మధ్య కాలం పెద్ద చెరువు భూమి ఆక్రమణలకు గురై 25 ఎకరాలకు కుదించుకుపోయింది. మరలా 2023జులై 1 న అప్పటి ఎం ఎల్ ఏ అవంతి శ్రీనివాసరావు "నవ్వి పోదురుగాక నాకేమిటి" అనే భావన తో మాజీ ఎం ఎల్ ఏ గంటా శ్రీనివాసరావు చెరువు పనులకు వేసిన శిలాఫలకం దగ్గర లోనే మరలా అవంతి శిలాఫలకం వేసి సుమారు రూ" 6 కోట్ల 56 లక్షల వ్యయం తో శంకుస్థాపన చేశారు. ఇలా రెండు ప్రభుత్వాలు చవి చూసిన చెరువు దగ్గర శిలాఫలకాలు అలాగే ఉన్నప్పటికీ ప్రస్తుతం చెరువు భూమి 17 ఎకరాలుకు కుదించిపోయి ఆక్రమణలకు గురయ్యిందని స్థానిక ప్రజలు ఆందోళన



వ్యక్తం చేస్తున్నారు. చెరువు భూమి ఆక్రమణ పై ఎం ఎల్ ఏ గంటాశ్రీనివాసరావు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

**రెండు ప్రభుత్వాలను చూసిన భీమిలి తీర ప్రాంత రక్షణ గోడ ప్రతిపాదిత నిర్మాణం:** 2014అక్టోబర్ 12 న సంభవించిన హుదూద్ తుఫాన్ సమయం లో భీమిలి సాగర తీరం పూర్తిగా కొట్టికుపోయి సముద్ర జలాలు పక్కనే ఉన్న బోయవీధి,బ్రాహ్మణ వీధి ఎగువపేట తదితర ప్రాంతాలను ముంచేసాయి.దీనితో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వయం గా భీమిలి వచ్చి భీమిలి సాగర తీరం ను పరిశీలించి చలించిపోయారు.తరువాత అప్పటి మంత్రి, స్థానిక ఎం ఎల్ ఏ గంటా శ్రీనివాసరావు తీర ప్రాంత ప్రజలను






ఆదుకొనేందుకు రక్షణ గోడ నిర్మిస్తామని చల్లగా హామీ ఇచ్చారు. అది హామీ కే పరిమితం అయ్యింది.షారా మాములే అన్నట్లు తరువాత 2019లో వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత అప్పటి ఎం ఎల్ ఏ అవంతి శ్రీనివాసరావు చేసిందేమి ఏమి ఉండదు గాని మాజీ ఎం ఎల్ ఏ గంటా శ్రీనివాసరావు పాడిన పాటే పాడి తక్షణమే భీమిలి తీర ప్రాంతం లో రక్షణ గోడ నిర్మించేస్తాను ప్రజలు సిద్ధం గా ఉండండి అని ప్రగల్భాలు పలికి పేపర్ కే పరిమితం చేసారు తప్ప, చేసింది శూన్యం. ఇక తగరపువలస లో రైతు బజారు ప్రారంభం, జూనియర్ కళాశాల ఏర్పాటు, తగరపువలస లో దీర్ఘకాలిక ట్రాఫిక్ సమస్య, ఆనందపురం లో జూనియర్ కళాశాల ఏర్పాటు, పద్మనాభం లో పాండ్రంగి వద్ద గోస్తనీ పై బ్రిడ్జి నిర్మాణం, జూనియర్ కళాశాల ఏర్పాటు, వరి కొనుగోలు కేంద్రం, పద్మనాభం మండలం చిన్నా పురం నుండి ఆనందపురం నీళ్లకుండీల వరకు పక్కాగా తారు రోడ్డు నిర్మాణం, సింహాచలం పంచ గ్రామాల సమస్య పరిష్కారం వంటివి తప్పక పరిష్కరిస్తామని గతం లో ఎం ఎల్ ఏ గంటా శ్రీనివాసరావు ప్రజలకు ఇచ్చిన హామీలే.

నియోజకవర్గ వర్గ ప్రజలు ఏ నమ్మకం తో ఆదరించి అత్యధిక మెజార్టీ తో గెలిపించారో వారి నమ్మకాలను వమ్ము చేయకుండా చిరకాలం నియోజక వర్గ ప్రజల గుండెల్లో స్థానం సంపాదించుకొనేలా పెండింగ్ సమస్యల పై త్వరితగతిన దృష్టి సారించి వాటిని పరిష్కరించాలని ఎం ఎల్ ఏ గంటా శ్రీనివాసరావు ను నియోజక వర్గ ప్రజలు కోరుతున్నారు.

VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : T.Sirisha , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839, 9160190123
Hyderabad (Sai Ganesh) : Cell : 9030841841, Kakinada (K.B. Ramarao): Cell: 9949413661, Parawada (satyanarayana): Cell: 77804 33919, Srikakulam : Cell: 70321 98574, Bheemili (D.V.Chalapathi Rao) : Cell: 9849603258, Office (Raghunath) : 7013785256. Arilova (D.Venkatesh) : 73825 85777. Maddilapalem (G.Raamakrishna) : 99084 24231, Yelamanchili (P.S.N. Murthy) : 83095 38789 Anakapalli (M.Krishna Rao) : 63023 75539
Paderu (P.Ravi Kumar) : 94908 12271 Parvathipuram (S.S.Naidu) : 94900 27519 Chintapalli (Srinivas) : 94923 40861 Chodavaram (BVR Murthy) : 81431 22188

గమనిక : ఇక్కడ ఇవ్వబడిన పేర్లు కలిగిన వారిని మాత్రమే విశాఖ సమాచారమ్ దినపత్రికకు విలేఖరులుగా గుర్తించవలెను. ఇక్కడ పేరు లేకుండా ఎవరైనా విశాఖ సమాచారమ్ ప్రతినిధిగా చెబితే నమ్మవద్దు.